అంగరంగవైభవంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
మండల పరిధిలోని వెల్‌చాల్ గ్రామంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామివారి కళ్యాణోత్సవం వేద బ్రాహ్మణులచే అంగరంగవైభవంగా నిర్వహించారు. గురువారం సాయంత్రం సామూహిక బోనాలు, నైవేద్యాలు సమర్పించి రాత్రి స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. తదుపరి రోజు రాత్రి రథోత్సవ కార్యక్రమం గ్రామ హనుమాన్ మందిరం నుండి బాజాభజంత్రీలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేసి, హైదరాబాద్ నగరానికి చెందిన హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనతో బయలుదేరి పులిలొంకలో వెలసిన ఆలయం వరకు శనివారం ఉదయం వరకు రథోత్సవం నిర్వహించారు. ఉదయం 11గంటల 35నిమిషాలకు శ్రీలక్ష్మీనరసింహుని కళ్యాణోత్సవం ఆలయశిల్పి కీర్తిశేషులు పరమదాసుస్వామి ఆశీస్సులతో నిర్వహించారు. సాయంత్రం పెరుగువసంతంతో ముగిసింది. ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల, ఇతరజిల్లాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

పేదల ఇళ్ల కూల్చివేత దుర్మార్గమైన చర్య

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో భూధాన్‌భూముల్లో ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చివేయడం దారుణమని బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు-ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. పేదల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిలి తిరిగి అధికారంలోకి రాదని ఆయన పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూధాన్ బాధితులతో శనివారం మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, ఖమ్మం జిల్లా బిజెపి అధ్యక్షులు కోటేశ్వరరావు, మేడ్చల్ రూరల్ జిల్లా ఉపాధ్యక్షులు గొంగళ్ల బాలేశ్‌లతో కలిసి సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. భూదాన్ భూముల్లో కూల్చివేసిన ఇళ్లను సందర్శించి బాధితులను పరామర్శించి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ధనదాహానికి, మంత్రుల దోపిడీకి భూదాన్ బాధితులు బలవుతున్నారని పేదల ఇళ్లను జెసిబిలతో నేలమట్టం చేయడంతో వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీస్త్రీలు ఎంతోమంది నిరాశ్రయులుగా మారారని, ప్రభుత్వ నిరంకుశవైఖరికి ఈఘటన నిదర్శనమని, సర్కారు బాధితులకు తిరిగి ఇళ్లు నిర్మించి న్యాయం చేయాలని సుదర్శన్‌రెడ్డి డిమాండ్‌చేశారు.

ముఖ్యమంత్రిని కలిసిన బార్ అధ్యక్షుడు

సిఎం రేవంత్‌రెడ్డితో న్యాయవాది యాదిలాల్

ఆమనగల్లు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని ఆమనగల్లు బార్ అసోషియేషన్ అధ్యక్షుడు, ప్రముఖ సీనియర్ న్యాయవాది అండేకర్ యాదిలాల్ శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. హైదరాబాద్‌లోని సిఎం నివాసంలో ఉదయం ముఖ్యమంత్రిని కలుసుకుని న్యాయవాదులు ఎదుర్కుంటున్న సమస్యలను వివరించారు. ముఖ్యంగా న్యాయవాదులకు రక్షణ చట్టం ప్రవేశపెట్టి అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా యాదిలాల్ మాట్లాడుతూ న్యాయవాదులపై తరచూ జరుగుతున్న దాడులను అరికట్టేందుకు రక్షణ చట్టం అమలు చేయవలసిన అవసరం ఉందని అన్నారు. ముఖ్యమంత్రిని కలిసి న్యాయవాదుల సమస్యలు వివరించడం సంతృప్తిగా ఉందని యాదిలాల్ అన్నారు.

అనంతగిరికి రాహుల్‌గాంధీ రాక

-భారీ బందోబస్తు ఏర్పాటుకు ఎస్పీ ఆదేశాలు

అధికారులకు ఆదేశాలిస్తున్న ఎస్పీ స్నేహ మెహ్రా

వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త:
ఎఐసిసి ఆధ్వర్యంలో 10 రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శిబిరం ముగింపు దశకు చేరుకుంది. వికారాబాద్ అనంతగిరి రిసార్టులో మార్చి 2న జరిగే ముగింపు కార్యక్రమానికి కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ హాజరుకానున్నారు. ఆయనవెంట సిఎం రేవంత్ కూడా విచ్చేస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 70మంది డిసిసి అధ్యక్షులకు 10రోజులపాటు శిక్షణ ఇస్తున్న విషయం తెలిసిందే. 10రోజులపాటు నేర్పిన అంశాలతోపాటు దిశానిర్దేశం చేయనున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ మరింత పటిష్టతపై నెమరువేయనున్నారు. అనంతరం డిసిసి అధ్యక్షుల కుటుంబాలకూ రాహుల్ టైమ్ ఇవ్వనున్నారు. ప్రతి కుటుంబంతో ఫొటో సెషన్ నిర్వహించనున్నట్లు పార్టీవర్గాలు తెలిపాయి. నిరాడంబరంగా సాగే రాహుల్ పర్యటన పట్ల డిసిసి అధ్యక్షులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల కూడా ఉంటారా, లేదా అనేది ఇంకా తేలాల్సి ఉన్నది. మీడియాను మాత్రం ఎప్పటిలాగే అనుమతించడం లేదు. మరోవైపు రాహుల్ పర్యటనకు పోలీసులు అత్యంత భారీ బందోబస్తు ఏర్పాట్లు చేయనున్నారు. శనివారం ఎస్పీ స్నేహ మెహ్రా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బందోబస్తు ప్రణాళికను వివరించారు. వివిఐపిల పర్యటన సందర్భంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, హెలిప్యాడ్ వద్ద భద్రత, కాన్వాయ్ ప్రయాణించే రూట్ మ్యాప్, సభాప్రాంగణం వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్పీ తగిన ఆదేశాలు జారీచేశారు. పర్యటన మార్గంలో ముందస్తుగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. ట్రాఫిక్ మళ్లింపు, ప్రత్యామ్నాయ మార్గాలను చూపనున్నారు. డ్యూటీ పోలీసులు అప్రమత్తంగా, సమన్వయంగా వ్యవహరించాలని స్పష్టంచేశారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా రాహుల్ పర్యటనకు పటిష్టవంతమైన చర్యలు చేపట్టాలని ఎస్పీ వివరించారు. సమావేశానికి హాజరైన అదనపు ఎస్పీ రాములునాయక్, డిఎస్పీలు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసులు, డిసిఆర్‌బి డిఎస్పీ జానయ్య, ఏఆర్ డిఎస్పీ వీరేష్, ఇన్స్పెక్టర్లకు తగిన ఆదేశాలు జారీచేశారు.

అనుమతి లేకుండా డీజే.. నిర్వాహకుడి అరెస్ట్

-కళాశాల ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు

పోటో: 28 జిటికె 3 పోలీసులు స్వాధీనం చేసుకున్న డిజే సామగ్రి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
అనుమతి లేకుండా కళాశాలలో డీజే నిర్వహించిన వ్యక్తిని అరెస్ట్ చేసి ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఘట్‌కేసర్ ఎస్ఐ ఎ.శేఖర్ తెలిపారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్ సమీపంలోని అరోరా కళాశాలలో అర్ధరాత్రి డీజే శబ్దాలతో న్యూసెన్స్ చేస్తున్నారని సమాచారం రావడంతో ఘట్‌కేసర్ పోలీసులు చేరుకొని విచారణ జరిపారు. కళాశాలలో ఆన్యువల్ టెక్నో ఫెస్ట్ కోసం అనుమతి తీసుకోకుండా డీజే ఏర్పాటు చేసినట్లు నిర్ధారించారు. నిబంధనలకు విరుద్దంగా డీజే ఆపరేట్ చేస్తున్న నిర్వాహకుడు చీలా ఓంకార్ (21)ను అరెస్ట్‌చేసి ఈఘటనకు బాధ్యులైన కళాశాల ప్రిన్సిపాల్‌పై కూడా కేసు నమోదు చేసి డీజే సామగ్రిని సీజ్ చేసినట్లు తెలిపారు. 2 వెయ్యి వాట్స్ సౌండ్‌బాక్సులు, 500 వాట్స్ సౌండ్‌బాక్సులు నాలుగు, ఒక 10,000 వాట్స్ ఆంప్లిఫైయర్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ శేఖర్ తెలిపారు.

యువతకు విదేశీ అవకాశాలు పెంపొందించాలి

-యుఈఎస్ అబ్రాడ్ ప్రారంభోత్సవం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
ఘట్‌కేసర్‌కు చెందిన అబ్బసాని నందరాజ్‌యాదవ్, మనీష్‌యాదవ్‌లు శుక్రవారం యుఈఎస్ అబ్రాడ్ కన్‌సల్టెన్సీ సేవలను అందుబాటులోకి తెచ్చారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం డివిజన్ జోడిమెట్ల వద్ద ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని పలువురు ప్రముఖులు విచ్చేసి ప్రారంభించారు. ఘట్‌కేసర్ మాజీ సర్పంచి అబ్బసాని యాదగిరియాదవ్ ఆధ్వర్యంలో విచ్చేసిన ప్రముఖులు, మాజీ ప్రజాప్రతినిధులకు కేరళ సంప్రదాయ వాయిద్యాలతో స్వాగతం పలికి సన్మానించారు. మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి నక్క ప్రభాకర్‌గౌడ్, పీర్జాదీగూడ మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, ఆర్‌టిఏ బోర్డు సభ్యులు బీమిడి జైపాల్‌రెడ్డి, ఘట్‌కేసర్, పోచారం మున్సిపల్ చైర్‌పర్సన్లు ముల్లి పావని జంగయ్యయాదవ్, బోయపల్లి కొండల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు విచ్చేసి కార్యాలయంలో పలు చాంబర్‌లను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. విదేశీ విద్య, ఉద్యోగాలు కల్పించడంలో యుఈఎస్ అబ్రాడ్ కన్‌సల్టెన్సీ మెరుగైన, నమ్మకమైన సేవలు అందించాలని వారు సూచించారు.

ప్రజా పాలనకు తాళం..? సామాన్యులకు నో ఎంట్రీ..!

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
ఇబ్రహీంపట్నం మండలపరిషత్ కార్యాలయంలో ప్రజా పాలనకు తాళంపడింది. అంతా అధికారుల సొంతరాజ్యమే నడుస్తోంది. తమకష్టాలు చెప్పుకోవడానికి కార్యాలయానికివచ్చే సామాన్య ప్రజలకు గేటుకు వేసిన తాళం దర్శనమిస్తోంది. వాహనంపై వస్తే కష్టాలు వర్ణనాతీతం. కిలోమీటర్ దూరంలో బండి ఆపి, మండుటెండలో నడుచుకుంటూరావాలి. మెయిన్ రోడ్డుమీద వాహనాలు నిలపాల్సి రావడంతో ట్రాఫిక్ స్తంభించి ప్రజలు నానాతిప్పలు పడుతున్నారు. ఇవేమీ అక్కడి అధికారు లకు పట్టవు. మా ఇష్టం.. వస్తే రండి లేకపోతే పొండి అన్నట్టుగా ఉంది వారితీరు. ఇంత జరుగుతున్నా జిల్లాపరిషత్ సిఈఓ కన్నెత్తి చూడకపోవడం దారుణం అంటూ ప్రజలు మండిపడుతున్నారు. ఇంచార్జీలతో నడుస్తున్న ఈ పాలనపై ప్రజలు నిప్పులు చెరుగుతున్నారు.

గేటుకు తాళం.. ప్రజలకు అవమానం!
మండల పరిషత్ కార్యాలయం మెయిన్ గేటుకు తాళం వేయడం ఇప్పుడు పెద్దచర్చగా మారింది. అర్జీలు పట్టుకుని వచ్చే సామాన్యులను లోపలికి రానివ్వకుండా గేటుకు తాళం వేసి అడ్డుకుంటున్నారు. బండి ఉంటే ఆఫీసుకు రావద్దా? ఇది మీ సొంతమా? అంటూ ప్రజలు నిలదీస్తున్నా అధికారుల నుంచి ఉలుకూ లేదు, పలుకూ లేదు. విచిత్రం ఏమిటంటే పంచాయతీ కార్యదర్శుల వాహనాలను లోపలికి రానివ్వడం లేదు. దీన్నిబట్టి అధికారుల తీరు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. వృద్ధులు, మహిళలు మండుటెండలో నడవలేక నానా అవస్థలు పడుతున్నారు.

హెడ్ క్వార్టర్స్‌లోనూ ఇంచార్జీల రాజ్యమే...
మండల కేంద్రమైన ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో అధికారుల కొరత వేధిస్తోంది. రెగ్యులర్ ఎంపిడిఓ లేకపోవడంతో పాలన గాలిలో దీపంలా మారింది. ఏపని కావాలన్నా ఇంచార్జీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోంది. కీలకమైన ఎంపిఓ శంషాబాద్ నుండి డిప్యూటేషన్ పై బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అధికారులపై ప్రజాప్రతి నిధుల పర్యవేక్షణ కరువవడంతో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

నిమ్మకు నీరెత్తినట్లు జడ్పిసిఈఓ...
అధికారుల తీరుపై జిల్లాపరిషత్ సిఈఓ కనీసం స్పందిం చడం లేదు. జిల్లాకేంద్రానికి ఇంతదగ్గరగా ఉన్నా.. పారిశుధ్యం పడకేసినా, ప్రజలను గేటుకు తాళంవేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా పట్టించుకోకపోవడం వెనుక మర్మమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారుల మధ్య ఏకాభిప్రాయం లేక, పర్యవేక్షణ కరువై ఈ ఆఫీసు అనాథ శరణాలయంలా తయారైంది. ఆఫీసు లోపలికి వెళ్లాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు. లోపలంతా మురికికూపంలా మారింది. వారం రోజులుగా చెత్త తీసేవాడే లేదు. ఆఫీసు మొత్తం కంపు కొడుతోంది. ముఖ్యంగా మరుగుదొడ్ల నిర్వహణ అధ్వాన్నంగా మారింది. కార్యాలయాన్ని శుభ్రంచేసే నాథుడే లేదు. ముక్కు మూసుకుని అర్జీలు ఇవ్వాలా? అని ప్రజలు అధికారుల నిర్లక్ష్యాన్ని నిలదీస్తున్నారు.

-ఇంచార్జ్ పాలనతో జనం అరిగోస..
-పట్టించుకోని ఉన్నతాధికారులు.
-పతాక స్థాయికి చేరిన అధికారుల తీరు

గేటుకు తాళం వేస్తున్న మండల పరిషత్ సిబ్బంది

నూతన కలెక్టర్‌గా దీపక్ తివారి

జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న దీపక్ తివారి

వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త:
వికారాబాద్ జిల్లా నూతన కలెక్టర్‌గా దీపక్ తివారి శనివారం ఐడిఓసి కార్యాలయంలోని తన ఛాంబర్‌లో తొలి సంతకం చేసి అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాజేశ్వరి, ఎసిఎల్‌బి సుధీర్, ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, నూతన కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని అన్నిశాఖల జిల్లా అధికారులు, సిబ్బంది హాజరై నూతన కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అధికారుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ, వికారాబాద్ జిల్లాలో జిల్లా కలెక్టర్‌గా పనిచేసే అవకాశం లభించడం తనకు గౌరవంగా, సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు, లక్ష్యాల మేరకు అన్నిశాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా ముందుకు వెళ్తామని అన్నారు. విద్య, వైద్యం ప్రధాన లక్ష్యాలుగా పెట్టుకుని సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. త్వరలోనే శాఖలవారీగా, మండలం వారీగా సమీక్షచేస్తానని, అధికారులు చేపట్టే పనులు, అభివృద్ధి ఫోటోలు, పూర్తి వివరాలతో నోట్ సమర్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మంగీలాల్, ఆర్డీఓ వాసుచంద్ర, కడా అభివృద్ధి అధికారి వెంకట్‌రెడ్డి, డిఆర్‌డిఏ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్ ఒకచోట.. చదువు మరోచోట!

-టురిటో అక్రమాలపై 'వార్త' స్పెషల్ ఫోకస్
-ఒక్కో విద్యార్థి నుంచి రూ. 2.5 లక్షల వసూలు!
-సొంత పర్మిషన్ లేక ఇతర కాలేజీల గుర్తింపుతో గిల్లికజ్జాలు!
-జిల్లా ఇంటర్ బోర్డు అధికారులకు కమిషన్ల పండగ!

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
కార్పొరేట్ విద్యాసంస్థల మాయాజాలం పరాకాష్ఠకు చేరింది. విద్యార్థులను ఆకర్షించడానికి ఒకపేరు.. రికార్డుల్లో చూపించడానికి మరోపేరుతో టురిటో క్లాసెస్ సరికొత్త అడ్మిషన్ల దందాకు తెరలేపింది. టురిటోకు కాలేజీ గుర్తింపు లేకపోవడంతో నిబంధనలకు విరుద్ధంగా బడంగ్‌పేట్‌లోని జూనియర్ కాలేజీ, దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు కాలేజీల పేరుతో అడ్మిషన్లు తీసుకుంటున్నారు. ఈ మాయాజాలం అంతా పరీక్షల వరకు సాఫీగానే సాగుతుంది. కాని, పరీక్షలురాసే సమయానికి హాల్ టికెట్లు చేతికి వచ్చినప్పుడు మాత్రమే టురిటో అసలు రంగు బయటపడుతుంది. తాము ఏడాది పొడుగునా టురిటోలో చదివితే.. హాల్‌టికెట్ మీద మాత్రం తాము ఎప్పుడూ చూడని నగరంలోని మరో కాలేజీ పేరు ఉండటం చూసి విద్యార్థులు అవాక్కవుతున్నారు. ఇది అక్రమమని తెలిసినా, రెండున్నర లక్షల రూపాయల ఫీజు కక్కుర్తితో ఈమూడుసంస్థలు కుమ్మక్కై తల్లిదండ్రులను నిలువునా ముంచుతున్నాయి.

ఆదిభట్ల కేంద్రంగా సామ్రాజ్యం...
ఆదిభట్ల సర్కిల్‌లో ఉన్న టురిటో క్యాంపస్‌కు ఎటువంటి విద్యాశాఖ అనుమతులు లేవు. కానీ అక్కడ వందలాదిమంది విద్యార్థులతో తరగతులు నిర్వహిస్తున్నారు. ఒకచోట అనుమతి తీసుకుని మరోచోట క్లాసులు నిర్వహించడం నిబంధనల ప్రకారం నేరం. కాని ఇక్కడ ఏకంగా ఒక సంస్థపేరుతో అడ్మిషన్లు ఇచ్చి, మరో సంస్థలో తరగతులు నిర్వహించడం మరింత విస్తుగొలుపుతోంది. అడ్మిషన్ ఒకచోట చదువు మరోచోట సాగడం వల్ల రేపు పరీక్షల ఫలితాల్లోగాని, సర్టిఫికెట్లలోగాని సాంకేతిక ఇబ్బందులు వస్తే బాధ్యులెవరు? అని విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు.

కట్టుకథలతో పేరెంట్స్‌కు గాలం...
అక్కడ సీటు వస్తుంది.. ఇక్కడ ర్యాంక్ వస్తుంది అంటూ తల్లిదండ్రులకు యాజమాన్యం కట్టుకథలు చెబుతోంది. ఈ ఏడు వస్తది.. మరో ఏడూ వస్తది అంటూ ర్యాంకుల మాయాజాలంతో తల్లిదండ్రులను బుట్టలో వేసుకుంటోంది. కాని, అసలు అనుమతులులేని కళాశాలలో చదువుతున్నామన్న విషయం విద్యార్థులకు, తల్లిదండ్రులకు తెలియకుండా జాగ్రత్త పడుతోంది. పరీక్షల సమయంలో హాల్ టికెట్లు వేరే కాలేజీ పేరుతో రావడం చూసి విద్యార్థులు అవాక్కవుతున్నారు. అనుమతులు లేని కళాశాల భవనంలో అనుకోని ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరిది? కేవలం టురిటో అనే పేరు చూసి మోసపోవద్దని, అసలు ఆసంస్థకు గుర్తింపు ఉందో, లేదో సరి చూసుకోవాలని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్న టురిటో అక్రమకేంద్రాన్ని సీజ్ చేయాలని వివిధ విద్యార్థిసంఘాలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

టురిటోకు నోటీసులు జారీ చేస్తాం...
-జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంక్యానాయక్
ఆదిబట్లలోని టురిటో కళాశాల నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు గుర్తించాం. గుర్తింపు కోసం వారు దరఖాస్తు చేసుకున్నప్పటికీ, ప్రభుత్వం నుండి ఇంకా ఎలాంటి అనుమతులు రాలేదు. అనుమతులులేకుండా తరగతులు నిర్వహిస్తున్నందుకు సదరు యాజమాన్యానికి నోటీసులు పంపిస్తాం. విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేసే విద్యాసంస్థలపై కఠినంగా వ్యవహరిస్తాం అని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంక్యానాయక్ పేర్కొన్నారు.

అనుమతులులేని కాలేజీని వెంటనే సీజ్ చేయాలి...
-కందడి శ్రీరామ్, పూర్వ ఎబివిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి
విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న టురిటో క్లాసెస్‌ను ప్రభుత్వం వెంటనే సీజ్ చేయాలి. ఒకచోట అడ్మిషన్ ఇచ్చి మరోచోట చదువుచెప్పడం పచ్చిమోసం. తల్లిదండ్రులు ఇలాంటి సంస్థల మాయమాటలు నమ్మి మోసపోవద్దు. విద్యాశాఖ అధికారులు స్పందించి బా ధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలి, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం అని పూర్వ ఎబివిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కందడి శ్రీరామ్ తెలిపారు.

అక్రమంగా టురిటో కళాశాలకు సహకరిస్తున్న కాలేజీల గుర్తింపు రద్దు చేయాలి...
-పి.జగన్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి...
టురిటో అక్రమాలకు సహకరిస్తున్న కాలేజీల గుర్తింపును ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి. సొంత అనుమతులు లేని సంస్థలకు అద్దె ప్రాతిపదికన గుర్తింపును అమ్ముకోవడం సిగ్గుచేటు. విద్యార్థుల జీవితాలను రిస్క్‌లో పడేస్తున్న ఈ విద్యా మాఫియాపై ఇంటర్‌బోర్డు కఠినచర్యలు తీసుకోవాలి. జిల్లాలోని అక్రమ విద్యాసంస్థలపై విచారణ జరిపి, బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయాలి. లేనిపక్షంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్త పోరాటం చేపడతాం అని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.జగన్ అన్నారు.

మార్చి 2న దహనం.. 4న హోలీ..

-హోలీపండుగపై బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ స్పష్టత

షాద్‌నగర్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
తెలుగువారి వేడుకల్లో ఒకటైన హోలీ పండుగకు సంబంధించి వేద బ్రాహ్మణుల పరిశీలన ద్వారా తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ స్పష్టత ఇచ్చినట్లు సంక్షేమ పరిషత్ షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తెలిపారు.

మహిళా కానిస్టేబుల్‌ను బలిగొన్న వత్తిడి..

-ఆత్మహత్య చేసుకున్న మహిళాకానిస్టేబుల్

వికారాబాద్, ప్రభాతవార్త:
మానసిక వత్తిడి తట్టుకోలేక ఓ మహిళాకానిస్టేబుల్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళాకానిస్టేబుల్ దివ్య(20) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దివ్య కోట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో పోస్టింగ్ అయినప్పటికీ ధారూరు సిఐ కార్యాలయానికి అటాచ్ చేశారు. దీంతో సిఐ కార్యాలయంలో రైటర్‌గా విధులు నిర్వహిస్తుంది. దివ్య స్వగ్రామం వికారాబాద్ పట్టణం సాయిబాబానగర్ కాలనీలో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటుంది. దివ్య తండ్రి కొన్ని సంవత్సరాల క్రితం మృతిచెందారు. అప్పటినుంచి దివ్య కుటుంబ సభ్యులు పలు సమస్యలతో బాధపడుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. దివ్య కానిస్టేబుల్‌గా విధుల్లో చేరినప్పటి నుంచి కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటుంది. ఈ సమస్యలతో వత్తిడికి గురైన దివ్య శనివారం ఉదయం చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న సిఐ రఘుకుమార్ సంఘటన స్థలానికి చేరుకుని, దివ్య మృతికిగల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సంఘటన స్థలంలో దివ్య రాసి ఉంచిన సూసైడ్ నోట్ లభించింది. ఆ లేఖలో.. నాన్న లేకపోవడం వల్లనే తమ కుటుంబం చాలా కష్టాలు అనుభవించిందని, ఆమె చావుకు ఎవరూ కారణం కాదని, లేఖలో పేర్కొంది. కానిస్టేబుల్ దివ్యకు ఆదివారం పెండ్లి చూపులు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం రాత్రి దివ్య పెండ్లి చూపుల విషయమై కుటుంబ సభ్యుల మధ్య చర్చ జరిగిందని, తర్వాత దివ్య నిద్రపోవడానికి గదిలోకి వెళ్ళిందని, తెల్లవారు నిద్రలేచి చూస్తే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించిందని కుటుంబ సభ్యులు రోదిస్తూ తెలిపారు. మృతురాలు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సిఐ రఘుకుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం శవాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు.

వీధికుక్కల దాడిలో నాలుగు లేగదూడలు మృతి

షాబాద్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
వీధికుక్కల దాడిలో నాలుగు లేగదూడలు మృతిచెందిన సంఘటన షాబాద్ మండల పరిధిలోని ఎట్లఎర్రవల్లి గ్రామంలో చోటు చేసుకుంది. బాధిత రైతు కొత్తకుర్వ నర్సింహులు తెలిపిన వివరాల మేరకు రోజు మాదిరిగానే తన వ్యవసాయ పొలం వద్ద లేగదూడలను కట్టేసి ఇంటికి వెళ్లానని, తిరిగి ఉదయం లేచి పొలం వద్దకు వెళ్లి చూడగా లేగదూడలు మృతిచెంది ఉన్నాయని, వీధి కుక్కలు కరిచి లేగదూడలను చంపాయని ఆరోపించారు. గ్రామంలో ఇంతకు ముందు వీధికుక్కలు ఇద్దరు వ్యక్తులను కరిచి గాయపర్చాయి. గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని, అధికారులు వీధికుక్కల నుండి ప్రజలను, పశువులను కాపాడాలని ఆయన కోరారు. పశువులపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్న తనకు ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

మరణ ధ్రువపత్రానికి వెలకట్టిన హోంగార్డు

కీసర, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:



మరణ ధృవపత్రాన్ని ఇప్పించడానికి లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా హోంగార్డు నాగేష్‌ని పట్టుకున్న దృశ్యం

మరణ ధృవపత్రానికి వెలకట్టిన హోంగార్డు నాగేష్‌ని అవినీతి నిరోధకశాఖ అధికారులు శనివారం రంగంలోకి దిగి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే యాదాద్రి జిల్లా భువనగిరి గ్రామానికి చెందిన తోటకూర మహేష్ నాలుగు నెలల క్రితం కీసరలోని తన బంధువుల ఇంటికి ఒక ఫంక్షన్‌కి వచ్చి కీసర నితిన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందా డు. కుటుంబ సభ్యులు పోస్టు మార్టం నివేదిక కోసం హోంగార్డు నాగేష్‌ని సంప్రతించారు. ఈ క్రమంలో గాంధీ ఆసుపత్రిలో పరి చయం ఉన్న డాక్టర్ సందీప్ పేరును ప్రస్తావిస్తూ పోస్టుమార్టం రిపోర్టు కావాలంటే 2 లక్షల రూపాయలు లంచంగా ఇవ్వాలని నాగేష్ డిమాండ్ చేసినట్లు అవినీతి నిరోధక శాఖ డిఎస్‌పి శ్రీధర్ తెలిపారు. చివరకు మృతుని మేనల్లుడు శరత్‌తో మాట్లాడుకుని 40 వేల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీంతో బాధితుడు శరత్ ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. అధికారులు పన్నిన ఉచ్చులో భాగంగా మొదట 5 వేల రూపాయలు తీసుకున్న నాగేష్ శనివారం మధ్యాహ్నం సమయంలో కీసర ఓఆర్ఆర్ సమీపంలోని ఒక హోటల్‌లో రెండవ విడత 35 వేల రూపాయలు తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం డాక్టర్ సందీప్, హోంగార్డు నాగేష్‌ని కీసర పోలీస్‌స్టేషన్‌కి తరలించి విచారణ చేస్తున్నారు. ఈ కేసును కీసర పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మోల్లగూడెం అభివృద్ధికి మైలురాయి

గుమ్మడిదల, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

గుమ్మడిదల మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న మోల్లగూడెం అభివృద్ధి పనులకు నూతన ఊపిరి పోశారు. ఎన్నో ఏళ్లుగా గ్రామస్థులు కోరుకుంటున్న కీలక మౌలిక సదుపాయాల కల సాకారందిశగా ముందడుగు పడింది. మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీగోడ నిర్మాణం, అలాగే మోల్లగూడెం నుంచి వీరారెడ్డి పల్లి మార్గంమధ్యలో ఉన్న బ్రిడ్జి నిర్మాణం కోసం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ద్వారానే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమని అన్నారు. ముఖ్యంగా విద్యార్థుల భద్రత, విద్యాప్రమాణాల పెంపే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీగోడ లేకపోవడం వల్ల చిన్నారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉండేదని, ఆ సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఈ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. అదేవిధంగా మోల్లగూడెం నుంచి వీరారెడ్డి పల్లి వెళ్లే మార్గంలో ఉన్న బ్రిడ్జి శోచనీయ స్థితిలో ఉండటంతో వర్షాకాలంలో గ్రామస్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారని గుర్తుచేశారు. వాగు ఉధృతికి రాకపోకలు నిలిచిపోయి, అత్యవసర సందర్భాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని శాశ్వతబ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయించామని, త్వరితగతిన పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ఉమాదేవి, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, గుమ్మడిదల మున్సిపాలిటీ చైర్మన్ చిన్న పాపని కుమార్‌గౌడ్, సర్పంచి దుర్గనర్సింగ్‌రావు, నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, నక్క వెంకటేశంగౌడ్, మాజీ సర్పంచి స్వామి, కొత్తపల్లి సత్తయ్య, సద్ది విజయభాస్కర్‌రెడ్డి, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, హుస్సేన్, అభిశెట్టి రాజశేఖర్, సురభి కుమార్‌గౌడ్, దామోదర్‌రెడ్డి, లక్ష్మణ్, వినోద్, ఆయాగ్రామాల సర్పంచులు వార్డుమెంబర్లు, మున్సిపాలిటీ కౌన్సిలర్లు స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, గ్రామపెద్దలు, మహిళలు, యువత పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

-పాఠశాల ప్రహరీ గోడ, బ్రిడ్జి నిర్మాణాలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన

పాఠశాల ప్రహరీ గోడకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

శ్రీవీరభద్రస్వామి జాతర గోడపత్రిక ఆవిష్కరణ

జాతర గోడపత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుమ్మడిదల, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో బొంతపల్లి, వీరన్నగూడెం వార్డులో కొలువై ఉన్న శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామివారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో జాతర గోడపత్రికను చైర్మన్ మద్ది ప్రతాపరెడ్డి, ఈవో శశిధర్ ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని జాతర విజయవంతానికి తమ సహకారం అందిస్తామని తెలిపారు. జాతర గోడపత్రిక ఆవిష్కరణతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొని భక్తులలో ప్రత్యేక ఉత్సాహం కనిపించింది.

ప్రాథమిక పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం



స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థుల దృశ్యం

కొండాపూర్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

కొండాపూర్ మండలం గంగారాం ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయంపాలన దినోత్సవాన్ని అత్యంత ఉత్సాహభరితంగా, సందడిగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే లక్ష్యంగా ప్రత్యేకకార్యక్రమాలు చేపట్టారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సేతు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు వెంకయ్య, రామకృష్ణ, అనిల్‌కుమార్ మార్గదర్శకత్వంలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలుబోధించే అరుదైన అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడిగా రిత్విక్ బాధ్యతలు నిర్వహించగా, పిఈటిగా జాశ్వంత్ వ్యవహరించారు. ఉపాధ్యాయుల పాత్రలో ఆఫీకా, సురక్షిత, శ్రీజ, ప్రియాంక, తేజశ్రీ, శ్రీవల్లి, ఎం.వైష్ణవి, జి.వైష్ణవి, నందిని, చరణ్, శివవంశీలు అందరినీ ఆకట్టుకున్నారు.

విద్యుత్ అధికారుల ప్రజాబాట

-రైతుల పొలాల్లోనే ప్రత్యక్ష పర్యటన

రైతులను ఆడిగి తెలుసుకుంటున్న విద్యుత్ శాఖ అధికారులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

రైతుల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపించడమే లక్ష్యంగా విద్యుత్ అధికారులు ప్రజాబాట కార్యక్రమం నిర్వహించి ప్రశంసలు అందుకున్నారు. గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని బొంతపల్లి గ్రామంలో పటాన్చెరు డివిజన్ విద్యుత్ ఇంజనీరింగ్ అధికారి భాస్కరరావు గురువారం ఉదయం 8గంటలకు రైతులు, గ్రామప్రజలతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధికారులు నేరుగా రైతుల పొలాల్లో పర్యటించి, క్షేత్రస్థాయిలో ఉన్న విద్యుత్ సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. రైతులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందేలా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో గుమ్మడిదల ఎడిఈ దుర్గాప్రసాద్, బొంతపల్లి ఎఈ రవీందర్, విద్యుత్ సిబ్బంది, రైతులు గ్రామస్థులు పాల్గొన్నారు.

నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం

-కొత్త పైప్‌లైన్ పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ కుమార్‌గౌడ్

పైప్‌లైన్‌ల కోసం తవ్విస్తున్న దృశ్యం

గుమ్మడిదల, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

గుమ్మడిదల మున్సిపల్ పరిధిలో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా మున్సిపల్ పాలకవర్గం కీలకచర్యలు చేపట్టింది. ఎలకచెరువు నుంచి గ్రామానికి సరఫరా అవుతున్న ప్రధాన పైప్‌లైన్ పాతదై, తరచూ లీకేజీలతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుండటాన్ని గమనించిన మున్సిపల్ చైర్మన్ కుమార్‌గౌడ్ శుక్రవారం నూతన పైప్‌లైన్ ఏర్పాటు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పొన్నాల శ్రీనివాస్‌రెడ్డి, మొగులయ్య, కాలనీవాసులు, గ్రామప్రజలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొని పనులను పరిశీలించారు.

ఇంద్రకరణ్ జడ్పిహెచ్ఎస్‌లో సైన్స్ దినోత్సవం

-విద్యార్థుల ప్రదర్శనలను తిలకించిన డిఈఓ.

జాతీయ సైన్స్ డేను జరుపుకుంటున్న విద్యార్థులు

కంది, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

మండలపరిధిలోని ఇంద్రకరణ్ గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో శనివారం విద్యార్థులు జాతీయ సైన్స్‌డేను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రదర్శనలను జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు తిలకించి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాలలోని 6నుంచి 9వతరగతి గదులను డిఈఓ పరిశీలించారు. ఉపాధ్యాయుల పాఠ్యప్రణాళికలు, డైరీ లాంటి అంశాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. 10వతరగతి విద్యార్థులతో డిఈఓ ముఖాముఖిగా చర్చించారు. విద్యార్థులతో మ్యాప్ పాయింటింగ్ లాంటి అంశాలను ఐఎఫ్‌బి పానెల్ బోర్డు ఉపయోగించడాన్ని అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి వార్షిక పరీక్షల్లో మెరుగైన మార్కులు సాధించేలా క్రమశిక్షణతో త్రిబుల్ ఐటి బాసరలో విద్యను అందుకునేలా పరీక్షలు రాయాలని సూచించారు.

ఖేడ్ పర్యటించిన చైర్మన్ నాగేష్‌శెట్కార్

ఖేడ్‌లో పర్యటిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ నాగేష్‌శెట్కార్

నారాయణఖేడ్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలో పలువార్డుల్లో మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్ విస్తృతంగా పర్యటించారు. ప్రతివార్డ్‌లో రోడ్లదుస్థితి, మురికి కాలువల సమస్యలు, డ్రైనేజీ వ్యవస్థ లోపాలు వంటి అంశాలను పరిశీలించారు. ప్రజల నుంచి సమస్యలను స్వయంగా విని, వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. డ్రైనేజీ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి, రోడ్ల మరమ్మతులు చేపట్టాలని చైర్మన్ నాగేష్‌శెట్కార్ స్పష్టమైన సూచనలు చేశారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు మెరుగుపర్చడం మున్సిపాలిటీ ప్రధానలక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ పర్యటనలో మున్సిపల్ ప్లానింగ్ ఆఫీసర్, 2వ వార్డ్ కౌన్సిలర్ సురేఖ, 5వ వార్డ్ కౌన్సిలర్ మహేష్, 9వ వార్డ్ కౌన్సిలర్ బాణపురం రాజు, 13వ వార్డ్ కౌన్సిలర్ వివేకానంద మహేందర్, మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు చామకురా పాండులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో విద్యను అందుకుంటే విజయం తథ్యం

-పటాన్‌చెరులోనే కేజీ టు పిజి ప్రభుత్వ విద్యాసంస్థలు

-ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

ఆత్మవిశ్వాసంతో విద్యను అందుకుంటే విజయం తమ సొంతకావడం తథ్యమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని 10వతరగతిలో విద్యనందుకుంటున్న 14వేలమంది విద్యార్థులకు ఎమ్మెల్యే తన సొంతనిధులతో రామచంద్రాపురం డివిజన్‌పరిధిలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో పరీక్ష సామగ్రిని పంపిణీచేశారు. ప్రతి సంవత్సరం నియోజకవర్గంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 10వ తరగతిలో విద్యను ఆర్జిస్తున్న విద్యార్థులకు వ్యక్తిత్వవికాస నిపుణులతో మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో మండలాల విద్యాధికారులు రాములు, సుధాకర్, పిపి రాథోడ్, వ్యక్తిత్వవికాస నిపుణులు మధు, నాయకులు రామచంద్రారెడ్డి, నర్రా బిక్షపతి, ఐలేష్‌యాదవ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

-నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి



ఇందిరమ్మ ఇల్లు ప్రారంభిస్తున్న దృశ్యం

తొగుట, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

ఇల్లు లేని ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ పథకంలో ఇల్లు నిర్మించి ఇవ్వడమే లక్ష్యంగా కాంగ్రెస్ సర్కార్ ముందుకు సాగుతుందని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జప్తిలింగారెడ్డిపల్లిలో శనివారం ఎన్నం నాగవ్వ కిష్టారెడ్డి నూతన ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ గాంధారి నరేందర్‌రెడ్డి, ఎఎంసి చైర్మన్ చెరుకు విజయ్‌రెడ్డి, అక్కం స్వామి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు పిట్ల సత్తయ్య, సర్పంచ్‌లు కనకయ్య, పాగాల శోభ కొండల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, సోలిపేట ప్రసాద్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, సంపత్ రెడ్డి, బాలరాజు, అంజనేయులు, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లోయి పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

మనూర్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ఎల్లోయి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సైమన్ స్వంతనిధులతో పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్‌లను రాష్ట్ర కాంగ్రెస్‌నేత పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి చేతులమీదుగా శనివారం బహూకరించారు. విద్యాప్రమాణాల మెరుగుకు తన వంతు సహకారం ఉంటుందని సైమన్ పేర్కొన్నారు. పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్‌లను అందచేసిన సైమన్‌ను కాంగ్రెస్‌నేత చంద్రశేఖర్‌రెడ్డి అభినందించగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ సైమన్‌ను, చంద్రశేఖర్‌రెడ్డిలను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచులు శివాజీరావుపాటిల్, దిగంబర్‌రెడ్డి, విఠల్ రావు, ఆంజనేయులు, బలరాంపటేల్, సైమన్, అశోక్‌పాటిల్, మల్లేష్, రాజు యాదవ్, లక్ష్మారెడ్డి, గోపాల్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కల్లేపల్లిలో శివాలయ పునఃప్రతిష్ఠ

శివాలయ పునఃప్రతిష్ఠ చేస్తున్న దృశ్యం

బెజ్జంకి, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కల్లేపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన శివాలయ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమంలో సర్పంచి బిగుళ్ల మోహన్ పాల్గొన్నారు. అనంతరం కల్యాణ మహోత్సవం, అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఉపసర్పంచి, వార్డుసభ్యులు, గ్రామప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం: సర్పంచి

గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచి మానసరాజేందర్

బెజ్జంకి, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

మండలపరిధిలోని దాచారంగ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో సర్పంచి భైర మానసరాజేందర్ ఆధ్వర్యంలో గ్రామంలోని పలు సమస్యలు, అభివృద్ధికార్యక్రమాలపై చర్చించారు. అనంతరం సర్పంచి మానసరాజేందర్ మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యపనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. గ్రామంలోని రోడ్లకు ఇరువైపుల ఉన్న గడ్డి, గడ్డిచెట్లను తొలిగించి వీధి దీపాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామ పంచాయతీ నూతన భవనం, పాఠశాల కాంపౌండ్‌వాల్, కిచెన్‌షెడ్, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర పనులు వేగవంతంచేయడం జరుగుతుందన్నారు. రానున్నరోజుల్లో గ్రామాభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకుపోతామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచి దీటి బాలనర్సు, వార్డుసభ్యులు, వివిధశాఖల ఉద్యోగులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం

ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్న దృశ్యం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజీ (బాయ్స్-1) నారాయణఖేడ్‌లో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ రాములు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అనేక వినూత్న నమూనాలను రూపొందించి ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణ, సాంకేతిక అభివృద్ధి, శక్తిసంరక్షణ వంటి అంశాలపై రూపొందించిన నమూనాలను అందరినీ ఆకట్టుకున్నాయి. ఉత్తమ నమూనాలు తయారుచేసిన విద్యార్థులకు బహుమతులు ప్రదానంచేసి అభినందించారు. పాఠశాల విజ్ఞానశాస్త్రం ఉపాధ్యాయులు రమేష్‌రెడ్డి, ఆసాసుల్తానాలను శాలువాలు, మొమెంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ సంజీవ్ నాయక్, స్కూల్ కోఆర్డినేటర్ మొహమ్మద్ జాకిర్, పిఈటి అజీజ్, పిడి సంతోష్. ఉపాధ్యాయులు నవనీత, బుజమ్మ, సుధీర్, రవీందర్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎర్రవల్లి నుంచి భద్రాచలంకు గోటి తలంబ్రాలు

మర్కుక్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

మండలపరిధిలోని ఎర్రవల్లి గ్రామం నుంచి భద్రాచలం శ్రీసీతారాముల కళ్యాణానికి గోటితలంబ్రాలు అందించే కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ దేవాలయంలో గ్రామ భక్తులు గోటి తలంబ్రాల దీక్షలో పెద్దఎత్తున పాల్గొన్నారు. శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు భద్రాచలం నుంచి తీసుకువచ్చిన వడ్లను కలశాలలో నింపి రామనామ స్మరణ మధ్య గ్రామ పురవీధులగుండా కాషాయ జెండాలు, కలశాలతో ఊరేగింపుగా పోచమ్మ ఆలయం నుండి హనుమాన్ దేవాలయం వరకు తీసుకువచ్చారు. అనంతరం మూడుగంటలపాటు రామనామ స్మరణతో వడ్లను గోటితో ఒలిచి తలంబ్రాలుగా మార్చి ఆయనకు అందజేశారు. ఇప్పటి వరకు 4వసారి భద్రాచల శ్రీసీతారాముల కళ్యాణానికి తెలంగాణ నుండి 3 క్వింటాళ్ల గోటి తలంబ్రాలు అందించడం జరుగుతుందని తెలిపారు. తమ గ్రామం నుండి రాములోరి కళ్యాణానికి తలంబ్రాలు వెళ్లడం పుణ్యఫలమని భక్తులు ఆనందం వ్యక్తంచేశారు. ప్రతి ఏడాది ఇదేవిధంగా తలంబ్రాలు సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామసర్పంచి, పాలకవర్గసభ్యులు, భక్తులు భిక్షపతి, కృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, హనుమాన్ భక్తబృందం సభ్యులు పాల్గొన్నారు.

బీరప్ప జాతరలో బోనాల ఊరేగింపు

బీరప్ప జాతరలో బోనాలను ఊరేగిస్తున్న భక్తులు

మనూర్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన మనూర్‌లో బీరప్ప జాతర నేత్రపర్వంగా కొనసాగుతోంది. ఉత్సవాల్లోభాగంగా శనివారం గ్రామస్థులు, మహిళలు స్వామివారికి బోనాలను ఊరేగింపుగా తీసుకుపోయి సమర్పించారు. బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. మార్చి 1వ తారీఖున శ్రీబీరప్ప, కామరతి కళ్యాణ మహోత్సవాలను కనులపండువగా నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఉత్సవాల్లో మనూర్ గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని బీరప్ప స్వామిని దర్శించుకున్నారు.

మిర్జాపూర్ జడ్పిహెచ్ఎస్‌లో సైన్స్ డే

మిర్జాపూర్ జడ్పిహెచ్ఎస్‌లో సైన్స్‌డేను జరుపుకుంటున్న దృశ్యం

న్యాల్‌కల్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

మండల పరిధిలోని మిర్జాపూర్(బి) గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సైన్స్ డేను విద్యార్థులు ఉత్సాహంగా జరుపుకున్నారు. పాఠశాలలో సైన్స్ పాఠ్యాంశాలను బోధిస్తున్న శ్రీకాంత్, శ్రీనివాస్, సరస్వతి ఉపాధ్యాయులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాలువాలతో సత్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రదర్శనలను ఉపాధ్యాయులు ఆసక్తిగా తిలకించారు.

మండలంలోని పాఠశాలల్లో సైన్స్ డే

సిర్గాపూర్ పాఠశాలలో సైన్స్ డేను జరుపుకుంటున్న విద్యార్థులు

సిర్గాపూర్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన సిర్గాపూర్‌తోపాటు మండలపరిధిలోని వాసర్ గ్రామంలోని పాఠశాలల్లో శనివారం సైన్స్ డే వేడుకలను విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. సిర్గాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ డేను మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్ ప్రారంభించి విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలను తిలకించారు. సిర్గాపూర్ పాఠశాలలో 9వ తరగతిలో విద్యను అందుకుంటున్న దుర్గా ప్రసాద్ రూపొందించిన ఫైర్ ఫైటింగ్ కార్ రోబో ప్రదర్శన ఆకర్షణగా నిలిచింది. మంటలను ఆర్పే రోబోను తయారుచేసి తన సృజనాత్మకతను చాటుకున్న దుర్గాప్రసాద్‌ను ఎంఈఓ శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు.

సిర్గాపూర్ పాఠశాలలో క్విజ్ పోటీలు...

మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ డేను పురస్కరించుకుని విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించారు. సైన్స్ ఉపాధ్యాయులు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ అంశాలపై విద్యార్థులను ప్రశ్నలువేసి జవాబులు రాబట్టారు.

వాసర్ జడ్పిహెచ్ఎస్‌లో...

మండలపరిధిలోని వాసర్‌గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యార్థులు జాతీయ సైన్స్ డే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో రంగురంగుల చాక్‌పీస్‌లతో విద్యార్థులు సైన్స్‌కు సంబంధించిన పలురకాల పటాలను (మెదడు, గుండె, నెఫ్రాన్, నాడీకణాలు, జ్ఞాననాడీకణాలు, ఆర్బిటాల్స్ తదితరమైనవి సైన్స్ టీచర్ పర్యవేక్షణలో చిత్రీకరించారు. పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు మంజులకులకర్ణి, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసహాయం

గుమ్మడిదల, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

ప్రజల డాక్టర్ రమేష్ మృతిచెందిన విషయం తెలుసుకున్న గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ మూడు చింతల నరేందర్‌రెడ్డి వెంటనే స్పందించి, బాధిత కుటుంబానికి రూ.20,000/ (ఇరవై వేల రూపాయలు) ఆర్థిక సహాయం అందించి తన ఉదార హృదయాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని, డాక్టర్ రమేష్‌కు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఇందుల సురేందర్ రెడ్డి, తులసిదాస్, ఆకుల ఆంజనేయులు, తుడుం శ్రీనివాస్, మహమ్మద్ జానీ, మేకల యాదగిరి, కరుణాకర్, ప్రభాకర్, రాజు రెడ్డి, కవ్వం రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఝరాసంగం పాఠశాలలో సైన్స్ దినోత్సవం

ఝరాసంగం, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

మండలకేంద్రమైన ఝరాసంగంలోని పిఎంశ్రీ టిజిఎంఎస్ పాఠశాలలో శనివారం జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని విద్యార్థులు ఉత్సాహంగా జరుపుకున్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పోస్టర్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందచేశారు.

మెల్లాచెరువు శుభ్రతకు టెనా గ్రీన్ ఆర్మీ శ్రీకారం

రామచంద్రాపురం, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:

పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ (టెనా) ఆధ్వర్యంలో టెనా గ్రీన్ ఆర్మీ మెల్లా చెరువుల పరిశుభ్రత కార్యక్రమానికి శనివారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేటర్ పటాన్‌చెరు సర్కిల్ సహకారంతో శ్రీకారం చుట్టారు. సమాజం పట్ల ఉన్న బాధ్యత, ఐక్యతను చాటేలా టెనా గ్రీన్ ఆర్మీ వాలంటీర్లు, మున్సిపల్ సిబ్బంది చెరువు శుభ్రతకు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టెనా అధ్యక్షులు ఈశ్వర్‌గారి రమణ మున్సిపల్ అధికారులకు సరస్సు పునరుద్ధరణ, సుందరీకరణ కార్యక్రమాలకు అందిస్తున్న చేయూతకు కృతజ్ఞతలు తెలిపారు.

మెల్లాచెరువులో శుభ్రత కార్యక్రమం నిర్వహిస్తున్న టెనా గ్రీన్ ఆర్మీ

సిఎం సహాయనిధి పేదలకు వరం : హన్మంత్ రెడ్డి

నూర్జహాన్‌కు చెక్కును అందజేస్తున్న హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 283 డివిజన్ బి .జె .ఆర్ నగర్ వాసులు ఎం.డి నూర్జహాన్ గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతు నిమ్స్ హాస్పిటల్ చికిత్స పొందుతున్నారు. చికిత్సకి సరిపడ్డ డబ్బులు లేక కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించగా వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా బాధితురాలికి శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 1,75,000 సీఎం సహాయనిధి ఎల్వోసీని మంజూరి చేయించారు. మంజూరి అయియిన పత్రాలను ఎం.డి నూర్జహాన్‌కు శనివారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కొలన్ హన్మంత్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన గుమ్మడి మధుసూదన్ రాజు



పొనం ప్రభాకర్‌ను సత్కరిస్తున్న గుమ్మడి మధుసూదన్ రాజు

పేట్ బషీరాబాద్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల 132 డివిజన్‌కు చెందిన తెలంగాణ ఉద్యమ నాయకుడు, గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన గుమ్మడి మధుసూదన్ రాజు ముదిరాజ్ రాష్ట్ర మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్‌ను శనివారం కలిశారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హనుమంత్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన గుమ్మడి మధుసూదన్ రాజు, కాంగ్రెస్ ప్రజాపాలనకు ఆకర్షితులై పార్టీ తీర్థం పుచ్చుకున్న విషయం తెలిసిందే. మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో మంత్రి పొనం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలియజేసి, నియోజకవర్గ అభివృద్ధి విషయాలపై చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రంగయ్య, కూన నవీన్ కుమార్ గౌడ్, రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బాగ్ లింగంపల్లిలో అన్నదానం

కార్యక్రమంలో పాల్గొన్న రాజేష్ కుమార్ అగర్వాల్ తదితరులు

చిక్కడపల్లి ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : బాగ్ లింగంపల్లిలో సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు రోషన్ లాల్ అగర్వాల్ ఫౌండేషన్ ట్రస్ట్, రాజేష్ కుమార్ అగర్వాల్ సౌజన్యంతో శనివారం ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక లంబాడీ సామాజిక వర్గీయులు తమ సంప్రదాయ దుస్తుల్లో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. లంబాడీ సామాజిక వర్గీయులు తమ సంప్రదాయ దుస్తుల్లో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ కుమార్ అగర్వాల్ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సేవాలాల్ బోధనలు స్ఫూర్తిదాయకం అని రాజేష్ కుమార్ అగర్వాల్ అన్నారు. సుమారు 2,000 మంది భక్తులు, స్థానిక నివాసితులు ఈ అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, అంజి యాదవ్, కె. రఘు వీర్, లోకేష్ యాదవ్, పీపల్ గంగాధర్, నవీన్ నాయక్, బాలు నాయక్, కరణ్ నాయక్, దర్యా నాయక్, గోపాల్ నాయక్, కళ్యాణ్ నాయక్, దేవేందర్ నాయక్, నారాయణ నాయక్, రెడ్యా నాయక్, దావునా నాయక్ పాల్గొన్నారు.

3న పాక్షిక చంద్రగ్రహణం..చిక్కడపల్లి శ్రీవారి ఆలయం మూసివేత

చిక్కడపల్లి ఫిబ్రవరి 28 (ప్రభాతవార్త) : మార్చి మూడన ఉదయం చిక్కడపల్లి శ్రీ వెంకటేశ్వరా స్వామి ఆలయాన్ని కేతు గ్రస్త పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా మూసివేయనున్నట్లు ఆలయం వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్ గౌడ్, సహాయ కమీషనర్ కె.రామాంజనేయులు వివరించారు. మార్చ్ 3 మంగళవారం ఉదయం ప్రాత:కాల పూజ అనంతరం ఆలయాన్ని మూసివేసి భక్తుల దర్శనాలను నిలిపివేనున్నారు. మధ్యాహ్నం 3.30 ప్రారంభమయ్యే పాక్షిక చంద్రగ్రహణం సాయంత్రం 6 గంటలకు ముగుస్తుంది. గ్రహణ కాలము ముగిసిన అనంతరము మరలా రాత్రి 07:00 గం.లకు ఆలయము ద్వారములు తీసి మహా సంప్రోక్షణ నిర్వహించి అనంతరము యధావిధిగా ద్వార బంధనము చేయబడుతుంది, తిరిగి 4 న బుధవారం రోజున ఉదయము యథావిధిగా దేవస్థానము ద్వారములు తెరువబడుతుందన్నారు.

ఘనంగా టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో జాతీయ సైన్స్ డే



జీడిమెట్ల, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త

జాతీయ సైన్స్ డే సందర్భంగా టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో వివిధ విద్యాసంస్థల్లో నేషనల్ సైన్స్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. టీవీఆర్ మేనేజింగ్ డైరెక్టర్ టి. వంశీకృష్ణ రెడ్డి మార్గదర్శకత్వంలో టీవీఆర్ మోడల్ హై స్కూల్ (అపురూప కాలనీ), సత్యవాణి విద్యానికేతన్ (ఎస్.ఆర్. నాయక్ నగర్), బచ్పన్ ఒలంపియాడ్ స్కూల్ (చింతల్), బచ్పన్ ప్లే స్కూల్ (సూరారం)లలో సైన్స్ డే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ శాస్త్రవేత్త సి. వి. రమణ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. రామన్ ఎఫెక్ట్‌కు నోబెల్ బహుమతి లభించిన సందర్భంగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ డే జరుపుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో 5వ తరగతి నుండి 7వ, 8వ తరగతి విద్యార్థులు వివిధ శాస్త్రీయ నమూనాలు తయారు చేసి సందర్శకులను ఆకట్టుకున్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసిన సైన్స్ అధ్యాపక బృందాన్ని పాఠశాల యాజమాన్యం అభినందించింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి దీక్ష జూనియర్ కాలేజీ డైరెక్టర్ డా. సూరా రవిచంద్రారెడ్డి హాజరై విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులను పరిశీలించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టి. కోటి రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్స్ దీప్తి రెడ్డి అభినందించారు.

నెక్కాంపూర్ బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలి : షాహెచ్ అన్సారీ

బేగంబజార్, ఫిబ్రవరి 28ప్రభాతవార్త: రంగారెడ్డిజిల్లా గండిపేటమండలం, మణికొండ గ్రామంలోని సర్వే నెంబర్ 53,53పార్ట్ 54/లోన లేక్‌వ్యూ ప్లాట్ నెంబరర్ 3 వద్ద అక్రమంగా 375 చదరపుగజాల స్థలంలో గ్రౌండ్ ప్లస్2 అంతస్థులతో కూడిన విల్లాలు, వ్యక్తి గత నివాస భవనాల నిర్మాణంజరుగుతుందని సీనియర్ కాంగ్రెస్ నాయకులు షాహెత్ అన్సారీ ఆరోపించారు. ఈమేరకు శనివారంఆయన నెఖ్నంపూర్‌లోన బఫర్‌జోన్ పరిధిలోని లేక్‌వ్యూలో జరుగుతున్న అక్రమాలపై హైడ్రా కమీషనర్ ఎ.వి.రంగనాథ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అనంతరం జాంబాగ్‌లోఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓ పక్కన హైడ్రా అధికారులు అక్రమ నిర్మాణాలు తొలగిస్తుండగా, జిహెచ్ఎంసి అధికారులు నిర్మాణదారులతో కుమ్మకై బఫర్‌జోన్‌లో సైతంభవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తూ, అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నట్లుఆరోపించారు. నెక్నంపూర్ గ్రామం సర్వే నెం.53,54పార్ట్ 54/ఎలోని అక్రమంగా నిర్మిస్తున్న భవనాలకు జిహెచ్ఎంసి ఎలా అనుమతులు మంజూరు చేసిందన్నారు. ఇటివల కాలంలో నగరంలోని సరస్సులు, ఉద్యానవనాలు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు హైడ్రా తీసుకుంటున్నచర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. హైడ్రా కమీషనర్ ఎ.వి రంగనాథ్ నేతృత్వంలోఅన్యాక్రాంతమైన కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాలు కాపాడారని గుర్తుచేశారు. ఇదే విధంగా మణికొండ మండల పరిధిలోని నెఖ్నంపూర్, లేక్‌వ్యూ కాలనీ బఫర్‌జోన్‌లోన అక్రమంగా కొనసాగుతున్న భవన నిర్మాణాలను అడ్డుకోవాలని హైడ్రా కమీషనర్‌ను కోరారు. భవననిర్మాణ అనుమతులు రద్దు చేసి అక్రమ నిర్మాణం చేపడుతున్న యాజమానిపై చట్టరీత్యా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

తన్మయుల్ని చేసిన భక్తకన్నప్ప పౌరాణిక పద్యనాటకం

భక్తకన్నప్ప పౌరాణిక పద్యనాటకం శ్రీకాళహస్తీశ్వర సాయుజ్యమ్‌లోని దృశ్యాలు

నాంపల్లి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థల సౌజన్యంతో మోడరన్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సహాయ సహకారాలతో అత్యంత అద్భుతంగా ప్రదర్శింపబడిన శ్రీకాళహస్తీశ్వర సాయుజ్యమ్ - భక్తకన్నప్ప పౌరాణిక పద్యనాటకం విచ్చేసిన అశేష రంగస్థల ప్రియుల్ని, ఔత్సాహిక ప్రేక్షకులను తన్మయుల్ని చేసింది. పరమశివుని సాయుజ్యం పొందడానికి కేవలం భక్తిప్రపత్తులే ప్రముఖమని చాటిచెప్పిన దీపికా ప్రసాద్ రచన-దర్శకత్వం, అద్దేపల్లి రాజ్‌కుమార్ నిర్వహణ, ఆహ్లాద క్రియేటివ్ థియేటర్, హైదరాబాద్ వారి సమర్పణలో శివుడుగా డా. పిల్లుట్ల లక్ష్మీకాంతశర్మ, తిన్నడుగా భాగి శివశంకరశాస్త్రిలతోపాటు ఇతర ప్రధానపాత్రల్లో సురభి రమాలక్ష్మి, వడ్డే సూర్యప్రకాష్, దీపికాప్రసాద్, మల్లాది వెంకటరమణ, సూర్యనారాయణమూర్తి, సిహెచ్‌వివిఆర్. మూర్తి, అద్దేపల్లి రాజ్‌కుమార్, శ్రీనివాసరావు తదితర అపూర్వ నటన ఆహుతులను మెప్పించి ప్రశంసలందుకున్నారు. అనంతరం బాపనపల్లి వెంకటస్వామిచే రావణబ్రహ్మ ఏకపాత్రాభినయం అబ్బురపరిచింది. చివరిగా అతిథుల చేతులమీదుగా నటీనటులను ఘనంగా సన్మానించారు.

నేటి నుండి కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై ప్రచారం

పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కే యం) రాష్ట్ర కన్వీనర్లు టీ సాగర్, బి రాము, డి జి ప్రసాద్,

చిక్కడపల్లి ఫిబ్రవరి 28 , ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నేటి నుండి గ్రామాల్లో ప్రచారం, రాష్ట్రపతికి వినతి పత్రాలు పంపడం మార్చి 9న ఢిల్లీలో కిసాన్ మజ్దూర్ పార్లమెంటు నిర్వహిస్తామని శనివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కే యం) రాష్ట్ర కన్వీనర్లు టీ సాగర్, బి రాము, డి జి ప్రసాద్, మండల వెంకన్న, బుర్రి ప్రసాద్, జక్కుల వెంకటయ్య, మామిడాల బిక్షపతి , విజయ్ లు పిలుపునిచ్చారు. కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడుతూ భారతదేశం అమెరికాతో చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని, 4 లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని, విద్యుత్ బిల్లు 2025, విత్తన బిల్లు 2025 ఉపసంహరించాలని, విబి గ్రామ్స్ చట్టం 2025 ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు, గ్రామసభలు నిర్ణయించిన విధంగా గ్రామీణ ప్రజలకు పని హామీ ఇచ్చే ఎం ఎన్ఆర్ ఈ జి ఏను రద్దు చేస్తూ విబి గ్రామ్స్ చట్టాన్ని విధించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. బహుళ జాతి కంపెనీల విత్తనాలను దిగుమతి చేసుకోవడం, ఇష్టానుసారంగా వసూలు చేసే స్వేచ్ఛ , విత్తనాల బ్లాక్ మార్కెటింగ్ చేయడానికి అనుమతించే కొత్త విత్తన బిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరిస్తున్నదని జీఎస్టీ వసూళ్లలో రాష్ట్రాలకు 60 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో రైతుల నిర్వహిస్తున్న పోరాటానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదే రకంగా ప్రధాన ప్రతిపక్షం అండగా నిలబడాలని కోరారు.

కరెంటోళ్ల ప్రజా బాటలో సిఎండి...

-బంజారాహిల్స్ సర్కిల్‌లో విద్యుత్ నెట్‌వర్క్ పరిశీలన

-మోతీనగర్‌లో స్థానిక వినియోగదారులతో మాటామంతి

మోతీనగర్‌లో స్థానికలతో మాట్లాడుతున్న సిఎండీ జితేష్ విపాటిల్, డైరెక్టర్ నర్సింహులు, శివాజీ తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న మరుసటి రోజే సిఎంఈడ జితేష్ వి పాటిల్ క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్లారు. కరెంటోళ్ల ప్రజాబాటలో భాగంగా బంజారాహిల్స్ సర్కిల్ పరిధిలోని మోతీనగర్ సెక్షన్‌లో శనివారం విద్యుత్ నెట్ వర్క్‌ను పరిశీలించి అక్కడి అధికారులు, సిబ్బందితో కలిసి తిరిగారు. అలాగే స్థానికులను కలిసి వారితో ముచ్చటించి విద్యుత్ సంబంధిత సమస్యలపై ఆరా తీశారు. అనంతరం మోతీనగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన పోల్ మౌంటెడ్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ (డీటీఆర్) ను ఆయన ప్రారంభించారు. ఈ వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ ముందస్తు సూచనల నేపథ్యంలో విద్యుత్ వినియోగం భారీ స్థాయిలో పెరిగే అవకాశముందని ఆయన పేర్కొన్నారు. నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యంగాపని చేస్తున్న తమ సంస్థ అధికారులు, సిబ్బంది తగు ఏర్పాట్లు చేపట్టారన్నారు. ఈ పర్యటనలో సంస్థ డైరెక్టర్ డా. నరసింహులు, వి శివాజీ, బంజారా హిల్స్ సూపెరింటెండింగ్ ఇంజినీర్ నరసింహులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే

అల్వాల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: అల్వాల్‌లో టైల ర్స్ డే ఉత్సవం ఘనంగా జరిగింది. మేరు సం ఘం తెలంగాణా జోన్ 11(అల్వాల్) ఆధ్వర్యంలో లోతుకుంట లోని కార్యా లయంలో జరిగిన ఉత్సవంలో పెద్ద సంఖ్యలో టైలర్స్ పాల్గొన్నారు. కుట్టు మిషన్ సృష్టి కర్త విలియమ్స్ హోవే జయంతిని ప్రపంచ వ్యాప్తంగా టైలర్స్ డేగా నిర్వహించు కోవడం ఆనవాయితీగా ఉంది. కుల వృత్తి అయిన టైలరింగ్‌పై ఆధార పడి ఉన్న లక్షలాది మంది ఆర్థికంగా సామాజికంగా వెనుకపడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 50 సంవత్సరాలు పైబడిన వారికి పెన్షన్, హెల్త్ కార్డ్, ఇళ్ళ స్థలం, మేరు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

- జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి



చార్మినార్ పరిసర ప్రాంతాలలో పర్యటిస్తున్న చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

చార్మినార్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి శనివారం ఉదయం పలు విభాగాల అధికారులతో కలిసి చార్మినార్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో పర్యటించారు. చార్మినార్, మక్కామసీదు, శాలిబండ, చౌమహల్లా ప్యాలెస్‌తో పాటు ప్రాంతాలలో పర్యటించి స్థానికంగా కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులు, ప్రధాన రహదారిలో పారిశుధ్య నిర్వాహణపై ఆయన అధికారులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకులతో రద్దీగా ఉండే చారిత్రాత్మకమైన చార్మినార్ కట్టడం పరిసర ప్రాంతాలలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండ అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ముర్గీ చౌక్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ సర్కిల్ డిఎంసి సరిత, యుబిడి డిప్యూటీ డైరెక్టర్ దేవజా ,మేనేజర్ రమేష్, ఎస్‌డబ్ల్యూ ఎండిఈ రాములు, ప్రాజెక్టు డిఈలు, ఏఈలుతో పాటు పలువురు పాల్గొన్నారు.

నిమ్స్ ఆసుపత్రికి 'సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలెన్స్' పురస్కారం



అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ పద్మజ, ప్రొఫెసర్ విజయ్‌కుమార్.

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త: నిమ్స్‌కి మెడికల్ కాలేజెస్ రీసర్చ్ కనెక్ట్ 2026 జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలెన్స్ పురస్కారం లభించింది. ఆరోగ్య పరిశోధన విభాగం, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో 2026-27 సంవత్సరానికిగాను నిర్వహించిన సదస్సులో దేశవ్యాప్తంగా వందకుపైగా మెడికల్ కళాశాలలు పాల్గొన్నాయి. మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ యూనిట్ల (ఎంఆర్‌యూఎస్) పనితీరును పరిశీలించి, అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన సంస్థలకు ఈ అవార్డును అందించారు. నిమ్స్ చేపట్టిన పరిశధోన కార్యక్రమాలు, నూతన ఆవిష్కరణలు, శాస్త్రీయ ప్రతిపాదనలకు ఈ గౌరవం దక్కింది. నిమ్స్ ఆసుపత్రి తరుపున ఈ అవార్డును ప్రొఫెసర్ పద్మజ, ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌లు ఐసీఎం ఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహల్ నుంచి అందు కున్నారు. దేశస్థాయిలో లభించిన ఈ గౌరవం తమ పరిశోధకుల అంకితభావానికి ప్రతిఫలమని నిమ్స్ డైరక్ట ర్ డాక్టర్ బీరప్ప అన్నారు. నిమ్స్ డీన్ ప్రొఫెసర్ లిజా రాజశేఖర్ సైతం అవార్డు రావడం పట్ల తమ బాధ్యత మరింత పెరిగిందన్నారు.

ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీక



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మౌలానా సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాద్రి

చార్మినార్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకని ఏఐఎస్ఎస్‌సి జాతీయ కన్వీనర్ మౌలానా సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాద్రి అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా పాతబస్తీ కోకాకితట్టిలో కౌన్సిల్ ఏఐఎస్ఎస్‌సి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కలిసి మెలిసి ఐకమత్యంతో ఉత్సవాలు జరుపు కుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మౌలానా ముర్తుజా పాషా, మౌలానా అలీ ఖాద్రి, మౌలానా సాదత్ ఫిర్ బుఖ్దా దీ, మౌలానా సుజా ఇఫ్తెకార్ పాల్గొన్నారు.

హత్యకేసుల్లో ఐదుగురు నిందితులు అరెస్ట్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు డి.సి.పి కృష్ణగౌడ్, ఈచిత్రంలోఏ.సి.పి ఎస్.సుదర్శన్, సిఐ రాఘవేంద్ర

బేగంబజార్, ఫిబ్రవరి 28ప్రభాతవార్త: పాత కక్షల కారణంగా ఒక యువకున్ని 8మంది యువకులు హత్యచేసి తప్పించుకు తిరుగుతున్న 5మంది నిందితులను అరెస్టు చేసి మంగళ్‌హాట్ పోలీసులు మూడు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోషామహల్ ఎ.సి.పి ఎస్.సుదర్శన్, మంగళ్‌హాట్ సిఐ రాఘవేంద్రతో కలిసి గోల్కొండ జోన్ అదనపు డి.సి.పి కృష్ణగౌడ్ మాట్లాడుతూ... అరాంఘర్ కాలని ప్రాంతానికి చెందిన రామేశ్వర్ అగర్వాల్ కుమారుడు రిషబ్ అగర్వాల్‌తో జుమ్మెరాత్‌బజార్ ప్రాంతానికి చెందిన రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ వ్యాపారి మున్నాసింగ్, లడ్డుసింగ్‌ఎలియాస్ లడ్డుతో పరిచయం చేసుకున్నాడు. ఓ కేసు విషయంలో తాను చర్లపల్లిలో జైల్‌లో తన ప్రత్యర్థి ముతా సభ్యుడితో కలిసి ఉన్నట్లు చెప్పాడు. మున్నాసింగ్, లడ్డుసింగ్‌లు రిషబ్‌అగర్వాల్ తన ప్రత్యర్థి ముతాతో చేతులు కలిపాడనే అనుమానంతో మున్నాసింగ్‌కు కలిగింది. ఏది ఏమైన్నప్పటికి తాను రిషబ్‌అగర్వాల్‌ను హత్యచేయాలని ప్లాన్ రూపొందించుకుని తనస్నేహితులైన మంగళ్‌హాట్ టక్కర్‌వాడి ప్రాంతానికి చెందిన మద్దూర్‌ప్రణయ్‌కుమార్, తిప్పని ఉదయ్‌కిరణ్, కుశంగల్ ఓంప్రకాష్, ,కిరాణా షాపు కార్మికుడు అమినేష్‌సింగ్, కునాల్‌సింగ్, మామ్‌తో కలిసి ఈనెల 25వ తేదిన రిషబ్ అగర్వాల్‌పై దాడికి దిగారు. 8మంది దెబ్బలకు తట్టుకోలేక రిషబ్‌అగర్వాల్ సృహతప్పి పడిపోయాడు. ఇది గమనించిన స్థానికులు కింద పడిపోయిన రిషబ్‌అగర్వాల్ వద్దకు వెళ్లి చూడగా సృహ తప్పి పడిపోయాడు. వెంటనే ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి చూడగా 8మంది దాడి చేయడంతో రిషబ్ అగర్వాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి శవ పంచనామా జరిపి ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న మంగళ్‌హాట్ పోలీసులు రంగంలోకి దిగి మున్నాసింగ్, లడ్డుసింగ్ ఎలియాస్ లడ్డు, మద్దూర్‌ప్రణయ్‌కుమార్, తిప్పని ఉదయ్‌కిరణ్, కుశంగల్ ఓంప్రకాష్, కిరాణా షాపు కార్మికుడు అమినేష్‌సింగ్, కునాల్‌సింగ్, మామ్ హత్యలో ఉన్నట్లు పోలీసులు సి.సి.టివీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించారు. విశ్వసనీసమాచారం మేరకు మంగళ్‌హాట్ పోలీసులు ఐదుమంది నిందితులనను అరెస్ట్‌చేసి విచారించారు. పోలీసుల విచారణలో నిందితులను నేరాన్ని అంగీకరించారు. వారిపై కేసు నమోదు చేసి మూడు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని కోర్టులోన హాజరు పర్చగా మేజిస్ట్రేట్ నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ 48గంటల సమయంలోనే హత్యచేసి తప్పించుకు తిరుగుతున్న 8మందిలో 5మందిన్ని అరెస్ట్‌చేశారు. మరో ముగ్గురు తప్పించుకు తిరుగతున్నట్లు చెప్పారు. ఈ కేసును మంగళ్‌హాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ఆక్రమణలు తొలగింపు

అల్వాల్, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త: మచ్చబొల్లారం మార్కెట్ ప్రధాన రహదారి ఆక్రమణలను శనివారం అధికార యంత్రాంగం తొలగించడం జరిగింది. జిహెచ్ఎంసి, ట్రాఫిక్ విభాగాలకు చెందిన యంత్రాంగం చేపట్టిన ఆక్రమణలు తొలగింపు సందర్భంగా స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. అధికారుల చర్యను బిఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. పేదలుపై కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా దమనకాండను కొనసాగిస్తోందని మాజీ కౌన్సిలర్ డోలి రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చిరు వ్యాపారులను రోడ్డుపై పడేశారని పేర్కొన్నారు. దశాబ్దాలుగా తాత్కాలిక ఆవాసాలు ఏర్పాటు చేసుకుని చిరు వ్యాపారులు జీవనాన్ని కొనసాగిస్తున్నారు. మచ్చబొల్లారం పరిసర ప్రాంతాలు వేగంగా విస్తరించిన నేపథ్యంలో ఉదయం సాయంత్రం వేళలలో ట్రాఫిక్‌కు మార్కెట్ వద్ద తీవ్రమైన ఇబ్బందులు కలుగుతున్నాయి. మల్కాజిగిరి జోన్ ట్రాఫిక్ డిసిపి లక్ష్మీ పర్యవేక్షణలో జిహెచ్ఎంసితో కలిసి స్పెషల్ డ్రైవ్‌ను చేయడం జరిగింది. నగర కమీషనర్ అవినాష్ మహంతి ఆదేశాలు మేరకు చర్యలు తీసుకుంటున్నామని ఆమె స్పష్టం చేశారు. రోడ్డు ఆక్రమణలు ఎక్కడ ఉన్నా ప్రజలు తమ దృష్టికి తీసుకుని రావాలని ఆమె కోరారు.

గ్రహణ సమయంలో ఈ నక్షత్ర జాతకులు చూడొద్దు

..బ్రహ్మశ్రీ పులిగడ్డ హనుమంతరాయశర్మ

ప్రసంగిస్తున్న బ్రహ్మశ్రీ పులిగడ్డ హనుమంతరాయశర్మ

చిక్కడపల్లి ఫిబ్రవరి 28 ప్రభాతవార్త : మార్చి మూడన సంభవించే కేతు గ్రస్త పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా కొన్ని నియమాలు పాటించాలని కళ్యానంద పీఠం అధినేత, ప్రముఖ వేదపండి తులు బ్రహ్మశ్రీ పులిగడ్డ హనుమంతరాయ శర్మ వివరించారు. శనివారం చిక్కడపల్లి లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రహణ సమయంలో జపాలు గ్రహణ పట్టు విడుపు స్నానాలు చేయాలని, గ్రహణము పుబ్బ, ముఖ నక్షత్ర జాతకులు సింహ కుంభ రాశి వారు గ్రహణాన్ని చూడరాదన్నారు. అదే రోజు రాత్రి 7 గంటలకు సంప్రోక్షణ అనంతరం యధావిధిగా పరివార దేవతలకు పూజలు నిర్వహించాలన్నారు.

ఆర్థిక ఇబ్బందుల కారణంగా వ్యక్తి ఆత్మహత్య

పేట్ బషీరాబాద్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త

ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ బ్యాంక్ మేనేజర్ ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు ముప్పాల రేవంత్ కుమార్ (38), నాలుగు సంవత్సరాల క్రితం తన స్వగ్రామం తిరుపతి నుండి భార్య, పిల్లలతో కలిసి హైదరాబాద్‌కు వచ్చి, యూనిటీ బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తూ పద్మానగర్ ఫేజ్-2 ప్రాంతంలో నివసిస్తున్నాడు. కుటుంబ అవసరాల నిమిత్తం వివిధ వ్యక్తుల వద్ద అప్పులు చేసినట్లు తెలిసింది. అయితే అప్పులు పెరుగుతూ ఉండటంతో వాటిని తీర్చలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురై, తీవ్ర మనస్తాపానికి లోనైన రేవంత్ కుమార్, శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని చూసి చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

-పాల్గొన్న ఎంఈఓ శంకర్ రాథోడ్,ఎస్.వెంకటేష్

అత్తాపూర్ ఫిబ్రవరి28ప్రభాతవార్త : సి.వి రామన్ చిన్నతనం నుంచి విజ్ఞాన శాస్త్ర విషయాల పట్ల అమితమైన ఆసక్తిని ప్రదర్శించేవాడని ఎంఈఓ శంకర్ రాథోడ్, కాటేదన్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్‌లు పేర్కొన్నారు. కాటేదాన్ డివిజన్‌లోని బాబుల్ రెడ్డి నగర్‌లో గల విద్యానికేతన్ హై స్కూల్‌లో నేషనల్ సైన్స్ డే వేడుకలుఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఎంఈఓ శంకర్ రాథోడ్, కాటేదన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్‌లు హాజరై విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులను సందర్శించారు. పర్యావరణ పరిరక్షణ, సౌర శక్తి, కాలుష్య నివారణ మరియు రోబోటిక్స్ వంటి అంశాలపై విద్యార్థులు తయారు చేసిన నమూనాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాల ల్యాబ్‌లో విద్యార్థులు చిన్న చిన్న ప్రయోగాలను స్వయంగా చేసి చూపిస్తూ, వాటి వెనుక ఉన్న శాస్త్రీయ కారణాలను వివరించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈవో శంకర్ రాథోడ్, ఎస్ వెంకటేష్ ప్రశంసా పత్రాలు , బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికే ఇలాంటి ప్రదర్శనలు దోహదపడతాయని, భవిష్యత్తులో వీరంతా గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బాల్ రాజ్ యాదవ్ , వెంకటరమణ , ఉప్పల్ శ్రీను , రామకృష్ణ , జె సునీల్ , సింహాద్రి , అనిల్ , రిషి , బొంబాయి రవి , అశోక్ కుమార్ , కార్తీక్ మరియు తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్‌లో చేరిన యువకులు

- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి

అత్తాపూర్ ఫిబ్రవరి28ప్రభాతవార్త : బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కలిసి కట్టుగా కృషి చేయాలని మాజీ మంత్రి సబిత ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం శంషాబాద్ డివిజన్ తొండుపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాచమల్ల జయసింహ, కొనమొల్ల శ్రీనివాస్, శంషాబాద్ మండల మాజీ ఎంపిపి డిద్యాల విజయ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున యువకులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి రాజేంద్రనగర్ బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ కార్తీక్ రెడ్డిల సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీ కండువాలు కప్పి యువతను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బిఆర్ఎస్ తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని భావించి పెద్ద ఎత్తున యువత పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మళ్లీ బిఆర్ ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరించి బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కలసికట్టుగా కృషి చేయాలని సూచించారు. తుప్పరా సునీల్, మంద శివ, బూర్గుల అశోక్, క్రిష్ణ, రాచమల్ల వెంకటేష్, రవీందర్, మదన్, జీవన్, నిఖిల్, నితిన్, ఋతిక్, తుప్పర హరి, కిషోర్, మంద మధు, దేశగ మహేందర్, రాహుల్ పాల్ లు కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలోకుమ్మరి అర్జున్, గిరి, చిలకమర్రి పరందాములు, రాచమల్ల రమేష్, పేదిరిపాటి మురళి, గౌస్ అలి, ఫాతిమా ,కొండ దర్శన్ గౌడ్, రమేష్ రాథోడ్, పోతుగంటి వినయ్ లు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE II ADDL. SENIOR CIVIL JUDGE: RANGA REDDY DISTRICT, AT: L.B.NAGAR
O.S.No. 78 of 2026

Between
Kokkiligadda Prabhakara Srinivas & Others ...Plaintiffs
AND
The Tahasildar, Hayathnagar Mandal & Others ...Defendants
To
All Concerned ...Defendant No.4

NOTICE

Please take notice that the Plaintiffs herein have filed the above suit against the Defendants for declaration of title and to declare the plaintiffs are the legal heirs of Late Mrs. Kokkiligadda Hima Bindu, who was the absolute owner and possessor of the below mentioned property. The above case is posted to 31-03-2026 for any objection.

SCHEDULE "A" PROPERTY

All that piece and parcel of Commercial Space No G-1 (Municipal No. 6-5-294/ Shop:G-1), (East Face area), in the Ground Floor , with Built up area 750 Sft, (including Common area) along with proportionate undivided share of land admeasuring 28.12 Sq. Yards out of 1004.96 Sq. Yards in the building complex named as "S.S.SILVER SPRINGS" in Survey No. 201, Ward No.6, Block No.5, Situated at VANASTHALIPURAM RESIDENTIAL COMPLEX, PHASE-V, SAHEBNAGAR KALAN VILLAGE, Hayathnagar Rev. Mandal, Under GHMC L.B. Nagar Circle, RANGA REDDY DISTRICT, Registration Sub-District Vanasthalipuram and bounded by:- NORTH: COMMERCIAL SPACE NO.2, SOUTH: PARKING AREA, EAST: ROAD, WEST: PARKING AREA

SCHEDULE "B" PROPERTY

All that piece and parcel of Commercial Space No G-2 (NORTH & EAST CORNER AREA) (Municipal No. 6-5-294/ Shop:G-2), in the Ground Floor , with Built up area 750 Sft, (including Common area) along with proportionate undivided share of land admeasuring 28.12 Sq. Yards out of 1004.96 Sq. Yards in the building complex named as "S.S.SILVER SPRINGS" in Survey No. 201, Ward No.6, Situated at VANASTHALIPURAM RESIDENTIAL COMPLEX, PHASE-V, SAHEBNAGAR KALAN VILLAGE, HAYATHNAGAR REVENUE MANDAL, UNDER GHMC LIMITS L.B. NAGAR CIRCLE, RANGA REDDY DISTRICT, Registration Sub-District Vanasthalipuram and bounded by:- NORTH: ROAD, SOUTH: COMMERCIAL SPACE NO.1, EAST: ROAD, WEST: PARKING AREA

SCHEDULE "C" PROPERTY

All that piece and parcel of land bearing Plot No. 110, admeasuring 200 Sq. Yards or 167.23 Sq. Mtrs., in Survey No. 201, Situated at TURKAYAMJAL Village, Hayathnagar Revenue Mandal, Ranga Reddy District, under Turkayamjal Gram Panchayath, Registration Sub-District Vanasthalipuram and bounded by:- NORTH: Plot No. 109, SOUTH: Plot No. 111, EAST: Plot No. 94, WEST: 30' wide Road

SCHEDULE "D" PROPERTY

All that piece and parcel of land bearing Plot No. 47, in Sy. No. 91, admeasuring 300 Sq. Yards or 250.83 Sq. Mtrs., Situated at TURKAYAMJAL Village, Hayathnagar Revenue Mandal (presently Abdullapurmet Revenue Mandal), Ranga Reddy District, under Turkayamjal Gram Panchayath, Registration Sub-District Vanasthalipuram and bounded by:- NORTH: Plot No. 46, SOUTH: Plot No. 48, EAST: 30' wide Road, WEST: Plot No.62

SCHEDULE "E" PROPERTY

All that piece and parcel of land bearing Plot No. 111, admeasuring 200 Sq. Yards or 167.23 Sq. Mtrs., in Survey No. 201, Situated at TURKAYAMJAL Village, Hayathnagar Revenue Mandal, Ranga Reddy District, under Turkayamjal Gram Panchayath, Registration Sub-District Vanasthalipuram and bounded by:- NORTH: Plot No. 110, SOUTH: Plot No. 112, EAST: Plot No. 93, WEST: 30' wide Road

SCHEDULE "F" PROPERTY

All that piece and parcel of the Open land bearing Plot No. 113, admeasuring 400 Sq. Yards or 334.34 Sq. Mtrs., in Survey No. 200, Situated at TURKAYAMJAL Village, Hayathnagar Revenue Mandal (presently Abdullapurmet Revenue Mandal), Ranga Reddy District, under Turkayamjal Gram Panchayath, Registration Sub-District Vanasthalipuram and bounded by:- NORTH: 40' wide Road, SOUTH: Plot No. 114, EAST: Plot No. 91, WEST: 30' wide Road

SCHEDULE "G" PROPERTY

All that piece and parcel of the open land bearing Plot No. 157, admeasuring 266.66 Sq. Yards or 222.95 Sq. Mtrs., in Survey No. 253 Part, 253, 254, 254 Part, 258/ [illegible], 259 ,339/ [illegible], 345/ [illegible], 257/[illegible]2 , and 257/[illegible]2, of J.B's BRUNDAVANAM, Situated at BRAHMANAPALLY, H/o. TORRUR Village, Abdullapurmet Revenue Mandal, Ranga Reddy District, under Turkayamjal Municipality, Registration Sub-District, Vanasthalipuram and bounded by:- NORTH: Plot No. 156, SOUTH: Plot No. 158, EAST: Plot No. 146, WEST: 40' wide Road

// By Order Of The Hon'ble Court //
M/s. BOINI ANAND
E. RAVINDER REDDY
G. SHUBHANGINI, Advocates
R/o: Flat No. 404, Balaji Residency
Gokul Nagar,Tarnaka,
Hyderabad-500017. Cell.9573263152

మేధాశక్తికి విజ్ఞాన సదస్సులు దోహదం

-ఎంఈఓ పాండు

సైన్స్ ఫేర్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ పాండు, కౌన్సిలర్ రాము

ఆమనగల్లు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
శాస్త్ర, సాంకేతిక, విజ్ఞాన సదస్సులు విద్యార్థుల మేధోశక్తిని పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడుతాయని ఆమనగల్లు మున్సిపాలిటీ చైర్మన్ నేనావత్ పత్యానాయక్, మండల విద్యాధికారి పాండు అన్నారు. జాతీయ సైన్స్‌డే పురస్కరించుకుని ఆమనగల్లు పట్టణంలోని బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్‌లో శనివారం సైన్స్ ఫేయిర్ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపాలిటీ చైర్మన్ నేనావత్ పత్యానాయక్, ఆమనగల్లు మండల విద్యాధికారి పాండు, బిఆర్ఎస్ పార్టీ నేత, స్థానిక కౌన్సిలర్ పాపిశెట్టి రాము, బ్రిలియంట్ సంస్థల డైరెక్టర్ ప్రసాద్‌రావులు ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈసంధర్భంగా పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటుచేసిన వస్తుప్రదర్శనలను ప్రారంభించి తిలకించగా, వాటి పనితీరును చిన్నారులు వివరించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకన్న, నాయకులు సైదులుగౌడ్, ఎంగలి ప్రసాద్, గణేశ్‌నాయక్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరించిన టిఎన్‌జిఓ నాయకులు

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవ వేడుకల పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. సంఘభవన్‌లో జరిగిన కార్యక్రమంలో టిఎన్‌జిఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల సాధికారతే సమాజ అభివృద్ధికి బాటలు వేస్తుందని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో నిర్వహించనున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహిళా విభాగం చైర్‌పర్సన్ రేవతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామారావు, కార్యదర్శి శ్రీనేష్‌కుమార్ నోరి, మహిళావిభాగం రాష్ట్ర కోశాధికారి శాంతిశ్రీ, శిరీష, నరహరి, షౌకత్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్, సృజనాత్మకత, సామాజిక ఆలోచనల సమ్మేళనమే సైన్స్

సైన్స్ మేళాలో పాల్గొన్న ప్రతినిధులు, ఉపాధ్యాయులు

కొత్తూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని పిఎంశ్రీ జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో శనివారం జన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జన్య ఆన్యూవల్ డే ఈవెంట్స్ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో భాగంగా మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించగా, విద్యార్థులు ఉత్సాహంతో పాల్గొన్నారు. విద్యార్థుల ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు జన్య ఫౌండేషన్ వారు మెడల్స్, మొమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమానికి విచ్చేసిన నాట్కో యాజమాన్యం సుమతి, జన్య ఫౌండేషన్ ప్రతినిధులు కె. సురేంద్రకుమార్, బి.రమణకి పాఠశాల తరపున అంగూర్‌నాయక్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సైన్సు ఉపాధ్యాయులు డాక్టర్ భగవంతు శ్రీనివాసులు, సిహెచ్ సుజాత, ప్రసన్నలక్ష్మి ౖ, రాజు, ఉపాధ్యా యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన నాపరాయి వ్యాపారులు

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

తాండూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
వికారాబాద్ జిల్లా తాండూరు ప్రాంతంలోని నాపరాతి వ్యాపారులు, పాలిషింగ్ యూనిట్ల నిర్వాహకులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. నాపరాయి పరిశ్రమలకు విద్యుత్‌శాఖ అధికారులు అసాధారణ బిల్లులు వసూలు చేస్తున్నట్లు వ్యాపారులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఎమ్మెల్యే సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించారని, ఎమ్మెల్యే చొరవతో నాపరాతి పరిశ్రమ యూనిట్లకు జారీ చేసిన అధిక విద్యుత్ బిల్లులను పునఃసమీక్షించి సవరించేందుకు విద్యుత్ శాఖ అంగీకరించిందని ఆయాసంఘాల నాయకులు శనివారం ఓ ప్రకటన ద్వారా హర్షం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా సమస్య పరిష్కారంలో స్టోన్ భవన్ చేస్తున్న కృషిని అభినందిస్తూ.. పరిశ్రమల ప్రయోజనాల కోసం ముందుకు వచ్చిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని నివాసంతో స్టోన్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సన్మానించారు.

నేడే ఆరోగ్య అవగాహన

యాచారం, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
యాచారం మండలపరిధిలోని నందివనపర్తి గ్రామంలోగల జ్ఞాన సరస్వతి ఆలయంలో ఆలయ వ్యవస్థాపకులు సదా వెంకరెడ్డి ఆధ్వర్యంలో ప్రకృతి వైద్యులు డాక్టర్ రామచంద్రరావు ఆధ్వర్యంలో వైద్య అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి సేవా భారతి సిద్ధార్థ యోగ విద్యాలయం వ్యవస్థాపకులు రామచంద్రరావు నందివనపర్తి గ్రామానికి విచ్చేసి ప్రకృతి వైద్యులు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని చుట్టుపక్కల గ్రామస్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు పేర్కొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తరలించొద్దు

యాచారం, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
యాచారం మండలపరిధిలోని నందివనపర్తి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుపనులను త్వరగా పూర్తిచేయాలని రంగారెడ్డి జిల్లా వైద్య ఉన్నతాధికారులను గ్రామస్థులు శనివారం కలవడం జరిగింది. యాచారం మండలంలోని నందివనపర్తి గ్రామం మేజర్ గ్రామపంచాయతీ. చుట్టుపక్కల గ్రామాలైన నాజ్దిక్‌సింగారం, అయ్యవారిగూడెం, తాడిపర్తి గ్రామాల నుండి నందివనపర్తి గ్రామం అందుబాటులో ఉంటుంది. కావున నందివనపర్తి గ్రామానికి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఏర్పాటు చేయగలరని జిల్లా వైద్య అధికారులని కలవడం జరిగింది. వైద్యాధికారులు స్పందిస్తూ అతి తొందరలో నందివనపర్తి గ్రామానికి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో విక్రమ్, గడ్డం దయాకర్, కొండాపురం నాగరాజు, జాపాలా శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

కొత్త క్రీడాకారులను ప్రోత్సహించాలి

-రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట్‌స్వామి
-ప్రతాపసింగారంలో క్రికెట్ గ్రౌండ్‌ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి

క్రికెట్ గ్రౌండ్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తదితరులు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు నగర శివారులో ఏర్పాటు చేసిన క్రికెట్ ఆటస్థలాలు ఎంతో ఉపయోగపడుతాయని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. పోచారం డివిజన్ ప్రతాపసింగారంలో శనివారం ఏర్పాటు చేసిన స్పాట్‌లైట్ క్రికెట్ గ్రౌండ్‌ను రాష్ట్రమంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొని రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డితోపాటు మాజీ జడ్పి చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు అమర్‌నాథ్ తదితరులు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి క్రికెట్ గ్రౌండ్ ప్రారంభోత్సవ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ దేశంలోనే క్రికెట్‌కు మంచి ఆదరణ ఉందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా మంచి ఆదరణ కనబరుస్తున్న క్రికెట్‌లో విద్యార్థులు, యువత రాణించాలని కోరారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు కృషిచేయాలని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ మైదానం నిర్వాహకులు గ్రామీణ క్రీడాకారులకు కోచింగ్ అందజేసి వారి ప్రతిభను వెలికితీయాలని అన్నారు. కొత్తగా వచ్చే క్రీడాకారులను ప్రోత్సహించాలని కోరారు.

ఉచిత పాస్‌ల కల్చర్ హైదరాబాద్‌లోనే ఉంది...
అత్యంత ధనవంతులున్న హైదరాబాద్ నగరంలో ఉచితపాస్‌ల కల్చర్ అధికంగా ఉందని మంత్రి అన్నారు. మ్యాచ్‌ల టిక్కెట్లు 15 శాతానికి మించి ఉండవని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వారు అందుకు అనుగుణంగా వ్యవహరించాలని మంత్రి ఐపిఎల్ టిక్కెట్ల విషయమై హెచ్‌సిఎను హెచ్చరించారు. దేశంలో ఎక్కడాలేని కల్చర్ హైదరాబాద్ లోనే ఉందన్నారు. క్రికెట్ అభివృద్ధికి హెచ్‌సిఎ అన్నివిధాలుగా కృషి చేయాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు క్రికెట్‌లో రాణించేందుకు విద్యార్థులు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పి చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, హెచ్‌సిఎ అధ్యక్షుడు అమర్‌నాథ్, నర్సింహారెడ్డి, బస్వరాజ్, స్థానిక నాయకులు పోచారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కర్రె రాజేశ్, నాయకులు తుంగతుర్తి రవి, కె.వినోద్‌కుమార్, బద్దం కుమార్, అబేదాబేగం, మాటూరి రవి, సిద్ధగోని నర్సింహాగౌడ్, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ గ్రౌండ్‌లో గాలిలోకి బెలూన్‌లు ఎగురవేసి, మంత్రితో పాటు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిలు బ్యాట్‌పట్టి క్రికెట్ ఆడారు.

జడ్పి పాఠశాలను సందర్శించిన మంత్రి...
క్రికెట్ గ్రౌండ్‌ను ప్రారంభించేందుకు విచ్చేసిన రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి గ్రామంలోని జిల్లాపరిషత్ పాఠశాలను సందర్శించి జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. స్టాల్స్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. మంత్రివెంట మాజీఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి, మాజీ జడ్పి చైర్మన్ ఎం.శరత్‌చంద్రారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజారవాణా పునరుద్ధరణ

బస్సును ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్, సర్పంచి

కొత్తూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
శంషాబాద్‌మండలం నానాజీపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం పునరుద్ధరణలో శుభపరిణామం చోటుచేసుకుంది. ఇటీవల గ్రామస్థుల వినతిపై స్పందించి చేవెళ్ల ఎంపి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి ఆర్టీసీ ఎండికి పంపిన లేఖకు ఫలితంగా, శనివారంనుంచి నానాజీపూర్ గ్రామానికి బస్సు సేవలు పునఃప్రారంభమయ్యాయి. శంషాబాద్-నానాజీపూర్ మార్గంలో నిలిచిపోయిన బస్ నం.453ఎన్ సేవలను తిరిగి ప్రారంభించడం ద్వారా విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు, రోజువారీ ప్రయాణికులకు భారీ ఊరట లభించింది. గ్రామ ప్రజలు ఇకపై ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా సౌకర్యవంతమైన ప్రజా రవాణా అందుబాటులోకి వచ్చింది. ఈసందర్భంగా ఆర్టీసీ ఎండి నాగిరెడ్డి, చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మైలారదేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, రాజేంద్రనగర్ డిపోమేనేజర్ కృష్ణారెడ్డికి గ్రామస్థులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి సురేఖరాజు, ఉప సర్పంచి విజయ్‌కుమార్, వంగ మహేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు మున్నూరు సిద్దులు, మైలారం రాధికాశ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, సిద్దేశ్వర్‌గౌడ్, సంతోష్ కుమార్, వెంకటేష్‌గౌడ్, మైలారం దర్శన్, మైలారం కృష్ణ, శ్రీనివాస్‌గౌడ్ గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

సౌందర్యరాజన్ పార్థివదేహానికి ప్రముఖుల నివాళులు

-ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి

మొయినాబాద్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు సౌందర్య రాజన్ మరణం హైందవ సమాజానికి తీరనిలోటని శాసనమండలి ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీపరిధిలోని చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకులు శుక్రవారం మృతిచెందడంతో పార్టీలకతీతంగా రాజకీయనాయకులు, ప్రముఖులు, మాజీ హోం మహేశ్వరం ఎమ్మెల్యే మంత్రి సబితాఇంద్రారెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యుడు గడ్డం రంజిత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య వారి కుటుంబానికి ప్రగాఢసానుభూతి తెలిపారు. శనివారం సౌందర్యరాజన్ అంత్యక్రియలు వారి కుటుంబసభ్యులు, మంత్రోచ్చారణ మధ్య బాలాజీ దేవాలయ ప్రాంగణంలో నిర్వహించారు. అంత్యక్రియల్లో ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. సౌందర్యరాజన్ అంత్యక్రియల్లో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు రాకేష్‌రెడ్డి కొంపల్లి అనంతరెడ్డి మొయినాబాద్ మున్సిపల్ వైస్‌చైర్మన్ గరుగు రాజు, మాజీసర్పంచి నరోత్తంరెడ్డి, విశ్వకర్మ మండల సీనియర్ అధ్యక్షుడు వడ్ల నరసింహచారి, అధ్యక్షుడు రాంపల్లి సంతోష్ కుమార్, టిఆర్ఎస్ మండలసీనియర్ నాయకుడు చెన్నయ్యయాదవ్, మాజీ సర్పంచి వీరభద్రస్వామి, చిలుకూరు మాజీ ఉపసర్పంచి నరసింహాగౌడ్ నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శానిటేషన్‌పనుల తనిఖీలు చేసిన మున్సిపల్ కమిషనర్

గుండ్లపోచంపల్లిలో పర్యటించిన మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన

మేడ్చల్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలో కొనసాగుతున్న శానిటేషన్ పనులను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన ఆకస్మిక తనిఖీ చేశారు. శనివారం డివిజన్‌లో ఆకస్మికపర్యటన చేపట్టిన కమిషనర్ శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా స్వచ్ఛ ఆటోల పనితీరును పర్యవేక్షించి చెత్త సేకరణ వివరాలను తెలుసుకున్నారు. అనంతరం నారాయణ చెరువును సందర్శించి శుభ్రతపై పలు సూచనలు చేశారు. అదేవిధంగా ప్రతి దుకాణం వద్ద డస్ట్‌బిన్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డిప్యూటీ కమిషనర్ సుదాంషు, డిఈఈ విజయలక్ష్మీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహపూర్వక వాతావరణం కల్పించాలి

-ఫ్యూచర్ సిటీ సిపి సుధీర్‌బాబు

కొత్తూరు పోలీసు స్టేషన్‌లో సమీక్ష చేస్తున్న సిపి సుధీర్‌బాబు

కొత్తూర్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
కొత్తూరు మండలంలోని కొత్తూరు పోలీస్ స్టేషన్‌ను శనివారం ఫ్యూచర్ సిటీ సిపి సుధీర్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిపాలన, కేసుల నిర్వహణ, భద్రతా వ్యవస్థలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణం, రికార్డ్ రూమ్, స్టేషన్ రైటర్ రూమ్, రిసెప్షన్ సెంటర్ వంటి విభాగాలను పరిశీలించి, వాటిని శుభ్రంగా, సమర్థవంతంగా నిర్వహించుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని దిశానిర్దేశం చేశారు. అలాగే నేరాలరేటు, రోడ్డు ప్రమాదాలు, చోరీ కేసులు, నమోదైన కేసుల దర్యాప్తు పురోగతిపై ఆరాతీశారు. పెండింగ్ కేసులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధానబాధ్యత అని సిపి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిపి సిహెచ్.శిరీష, ఎసిపి లక్ష్మీనారాయణ, ఇన్స్పెక్టర్ నర్సయ్య, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లబ్దిదారులకు డబుల్ బెడ్‌రూమ్‌లు అందజేసిన ఎమ్మెల్యే

-తొలి విడతలో 1200 ఇండ్ల పట్టాలను అందజేస్తాం
-షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



డబుల్ బెడ్ రూమ్ ఇంటి ప్రొజెటింగ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
ఎదురుచూసిన స్వప్నం ఎట్టకేలకు సాకారమైంది.. డబల్ బెడ్‌రూమ్ ఇళ్లు అర్హులైన లబ్ధిదారుల చేతికి అందాయి. షాద్‌నగర్ మున్సిపాలిటీ సమావేశ మందిరంలో శనివారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. తొలివిడతగా లబ్ధిదారులకు 1,200 ఇళ్లను అందజేస్తున్నట్లు వివరించారు. పట్టణంలోని 28 వార్డుల నుంచి లబ్ధిదారులను ఎంపిక చేశారు. అన్ని వార్డులలో ఎమ్మెల్యే శంకర్ చేతులమీదుగా కొంతమందికి లాంఛనంగా ఇళ్లపట్టాలు ఇప్పించారు. మున్సిపాలిటీ చైర్మన్ అగ్గనూరు బస్వం, వైస్ చైర్మన్ అందే మోహన్, ఆర్డీవో సరిత, తహసీల్దార్ నాగయ్య, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ మొహమ్మద్ అలీఖాన్ బాబర్, మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డిలతో పాటు అన్ని వార్డులకు చెందిన కౌన్సిలర్ల సమక్షంలో ఈ ఇళ్ల పట్టాలను అందించారు. కౌన్సిలర్లు సర్వర్ పాషా, నడికూడ శ్రావణి, వొగ్గు జయలక్ష్మి, పెంటయ్య, రాజునాయక్, స్థానిక నాయకులు అగనూరు విశ్వం, చెంది తిరుపతిరెడ్డి, సుజీవన్, దంగు శ్రీనివాస్, అగ్గనూరు నందు, ఇబ్రాహీం, జమాల్పూర్ చందు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నదుపాయాల కోసమే జాప్యం...
డబల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయినప్పటికీ అక్కడ పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించే ఉద్దేశంతోనే లబ్ధిదారులకు ఇళ్లను అందించే విషయంలో జాప్యం జరిగిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కౌన్సిలర్లు పార్టీలకు అతీతంగా దగ్గర ఉండి లబ్ధిదారులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. గృహాలు అందించే విషయంలో పారదర్శకంగా ముందుకు వెళ్లామని స్పష్టం చేశారు. ప్రస్తుతం 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇంకా అర్హులకు ఇవ్వాల్సి ఉందని, ఇందిరమ్మ ఇల్లు అందని వారికి వాటిని అందించే ఏర్పాటు చేస్తామని స్పష్టంచేశారు.

బాల్యవివాహ విముక్తిరథం ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్...
బాల్యవివాహాలను అరికట్టే విషయంలో బాధ్యతగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆశ్రిత స్వచ్ఛంద సేవాసంస్థ, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ సంస్థల ఆధ్వర్యంలో లైన్ డిపార్ట్మెంట్ సహకారంతో బాల్యవివాహ విముక్త ప్రచార రథయాత్ర పట్టణంలో శనివారం ప్రారంభమైంది. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఈ రథయాత్రను ప్రారంభించారు. వందరోజుల పాటు నిర్వహిస్తున్న బాల్యవివాహ విముక్త క్యాంపెయిన్ ఒక మంచి ప్రయత్నమని అభినందించారు. ఆశ్రితా సంస్థ డైరెక్టర్ ఎస్.నాగరాజు, రంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ మాధవిరెడ్డి, చైల్డ్ లైన్ బృందానికి చెందిన జ్యోతి, ఐసిడిఎస్ సిడిపిఓ ఉదయ, సూపర్వైజర్లు విజయలక్ష్మీ, గీతా, మాధవి, యశోద, మమత, రఘు, శారద, పద్మ, సుమంత్, వీరబాబు, దశరథ, పవిత్ర తది తరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్ ఎస్ఐగా భరత్‌భూషణ్

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారమే పోలీసులకు బలం అని మోమిన్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు నూతన సబ్‌ఇన్స్‌పెక్టర్‌గా భరత్‌భూషణ్ పదవీబాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా పోలీస్‌సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. పదవీబాధ్యతలు చేపట్టిన అనంతరం ఎస్ఐ భరత్‌భూషణ్ మాట్లాడుతూ మోమిన్‌పేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ తన ప్రధానకర్తవ్యం అని, అన్నారు. ప్రజారక్షణకు పోలీస్‌శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. మహిళల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని, గ్రామాల్లో పహారా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు. పోలీసులు, ప్రజలు కలిసి పనిచేస్తేనే నేరాల నివారణ సాధ్యమవుతుందన్నారు. ప్రజలసహకారం, సమాచారమే తమశక్తి అని అన్నారు.

ఇందిరమ్మ పథకంతో సాకారమైన సొంతింటి కల

ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఏఈ సుస్మిత, రవినాయక్

దుద్యాల్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోందని మండల ఎస్టీసెల్ అధ్యక్షుడు రవినాయక్ అన్నారు. శనివారం మండలపరిధిలోని సంత్రకుంట తండాలో కవిత, బాబ్యరాథోడ్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని హౌసింగ్ ఏఈ సుస్మితతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిషన్, నాయకులు రాహుల్, రతన్, సల్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రదర్శనలు

వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

దుద్యాల్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
విద్యార్థుల్లో సృజనాత్మకత ను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడుతాయని ప్రధానోపాధ్యాయుడు మల్లప్ప అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వైజ్ఞానిక మేళాను టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థులు చిన్ననాటి నుంచే కొత్త ఆలోచనలపై దృష్టి సారించి, సాంకేతిక రంగంలో ఎదగాలని ఆకాంక్షించారు. ప్రకృతిలో ఉన్న ఎన్నో విషయాలు సైన్స్ ద్వారా తెలుసుకోవచ్చున్నారు. సైన్స్ ఉపాధ్యాయులు ముకుంద రెడ్డి, శ్రీనివాస్, రమేష్‌ల పర్యవేక్షణలో పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తిలకించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాములు, అభయ్ కుమార్, రవి నాయక్, సాలిబాయి, మాధవి, నవీన తదితరులు పాల్గొన్నారు.

పన్నులు వసూలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

పరిగి టౌన్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
పరిగి పురపాలక సంఘ కార్యాలయం కౌన్సిల్ హాల్ నందు శనివారం కమిషనర్ వెంకటయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటిపన్నులు, వృత్తి వ్యాపార లైసెన్సులు, నల్లాబిల్లులు వసూలుచేయాలని, పన్నులు చెల్లించనివారికి రెడ్ నోటీసులు ఇవ్వాలని, పై పన్నులు చెల్లిస్తేనే సిబ్బంది జీతాలను, పరిగి పట్టణాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తామని, అందరూ వార్డు అధికారులకు, బిల్ కలెక్టర్లకు సమయపాలన పాటించి పన్నులు వసూలుచేయాలని ఆదేశాలు జారీ చేశారు. కావున పట్టణ ప్రజలందరూ సహకరించి సకాలంలో పన్నులు చెల్లించాల్సిందిగా కమిషనర్ విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేష్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ దశరథం, బిల్ కలెక్టర్లు, శ్రీనివాస్, పురపాలక సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

మసీదు-ఎ-అబ్దుల్లా ఖురాన్ పూర్తి

-హాఫీజ్ సయ్యద్ మజార్ అలీ నోమాన్‌కు సన్మానం

హాఫీజ్ సయ్యద్ మజార్ అలీ నోమాన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

షాద్‌నగర్, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త:
హాఫీజ్ -ఎ-ఖురాన్‌ను ప్రోత్సహించడానికి ఎస్‌పి హోండా షైన్ 125 బహుమతి, అల్లామా ముఫ్తీ సయ్యద్ చందాహుస్సేని, మోలానా మొహ్సిన్ పాషా విశ్వాసాన్ని పెంపొందించే ప్రసంగాలు రంగారెడ్డి జిల్లాలోని ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్‌లో ఉన్న మసీదు-ఎ-అబ్దుల్లాలో ఆధ్యాత్మిక, ఆశీర్వాద సమావేశం జరిగింది. మదీనా మసీదు షాద్‌నగర్‌కు చెందిన ఖతీబ్, హాఫీజ్ సయ్యద్ ముజమ్మిల్ అలీ ఇర్ఫాన్ కుమారుడు మౌల్వీ హాఫీజ్ సయ్యద్ మజార్ అలీ నోమాన్ మొదటి పది రోజుల్లో పూర్తి ఖురాన్ పఠించారు.
ఈ సమావేశంలో భారతరత్న అవార్డు గ్రహీత అసదుల్ ఉలామా తన్వీర్ ఎసఫాత్ హజ్రత్ మోలానా ముహ మ్మద్ మొహ్సిన్ పాషా అన్సారీ ఖాద్రీ నక్షబంది ముజద్దిదీ, జామియాఉల్‌సలాసిల్, మౌల్వీ కామిల్‌ఎహదీత్ జామియా నిజామియా, ఆల్ ఇండియా సున్నీ ఉలేమా మషాయిఖ్ బోర్డు జనరల్ సెక్రటరీ మహబూబ్‌నగర్ పాల్గొన్నారు, వారు పవిత్రఖురాన్ గొప్పతనం ఔన్నత్యంపై ప్రసంగంచేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ లీడర్ జమ్రుద్‌ఖాన్, మొహమ్మద్ అబ్దుల్‌రావుఫ్, మజీద్ ఆజం, అద్నాన్, హాఫీజ్ అబ్దుల్ సలీం, హాఫీజ్, మొహమ్మద్ జహంగీర్, మహమ్మద్ అబ్దుల్ రహీం, సయ్యద్ హసన్ అలీ, మొహమ్మద్ అబ్దుల్ శైబాస్, సయ్యద్ అన్వర్ అలీ, మహమ్మద్ అబ్దుల్ నాసర్, మొహమ్మద్ మోసిన్, మొహమ్మద్ సాదత్ అలీ, మోజాన్ హమీద్ అలీ ఖాన్, కాలనీవాసులు, వివిధకాలనీలకు చెందిన ముస్లింలు పాల్గొన్నారు.